

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

Please visit : www.srimeherbaba.com

సంపుటి :22 సంచిక: 1 హైదరాబాద్ 2022 మే పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com**



# నూతన ట్రస్టు సభ్యునిగా గోపి

బాబా ట్రస్టు సభ్యునిగా శ్రీ కాల గోపాలకృష్ణ మెహెర్ (48) నియమితులయ్యారు. ఈ మేరకు ట్రస్టు సభ్యులు 2022 మే 14న తగిన నిర్ణయం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. పాఠకులందరికీ ఈయన శ్రీ గోపిగా సుపరిచితుడు. మధుర గాయకుడైన శ్రీ గోపి, కోఠి సెంటర్ వ్యవస్థాపకులైన శ్రీ నోరి ప్రకాశరావు ముని మనుమడు. శ్రీ నోరి ప్రకాశరావు 1958 ఫిబ్రవరిలో మెహెరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస్‌లో అవతారుడిని దర్శించుకున్నారు, ఆ పిదప 1960లో సికింద్రాబాద్‌లోని వారింట్లోనే బాబా కేంద్రాన్ని ప్రప్రథమంగా ఏర్పాటు చేశారు. గత ఐదు తరాలుగా శ్రీ నోరి కుటుంబసభ్యులు బాబా సేవలో విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీ గోపి బిటెక్ పూర్తయ్యాక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా బ్యాంక్ ఆఫ్ అమెరికా, హైదరాబాద్‌లో పనిచేస్తునారు. బాబా ఇచ్ఛ ప్రకారం నడుచుకునేలా అవతారుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు మెహెర్‌బాబా ప్రతినిధితో అన్నారు.




**విశాఖపట్నం కేంద్ర నూతన కార్యవర్గం (2022 –2024).****వివరాలు పేజి. 37లో..**

# బాబా సందేశం

భగవంతుని ప్రేమించుటే జీవిత ధ్యేయం.

భగవంతునితో తాదాత్మ్యం చెందుటే జీవిత గమ్యము.

గౌరవ సంపాదకులు
మల్లాది కృష్ణానంద్
**99595-53218,**
**malladisukku@gmail.com**

వ్యవస్థాపకులు:
**శ్రీ దశిక ప్రసాదరావు**

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. శ్రీ అక్బర్ కృష్ణ | 6-10 |
| 3. మండలి హాలు | 11-14 |
| 4. దర్పణ దర్శనం | 15 |
| 5. బందరు సహవాస్ | 16-17 |
| 6. బాబా కేంద్రాలు | 18-19 |
| 7. లార్డ్ మెహెర్ | 20-26 |
| 8. నీలం సంజీవరెడ్డి | 27-29 |
| 9. తూర్పు -పశ్చిమ సహవాస్ | 30-34 |
| 10. కొత్త పుస్తకం-త్వరలో | 34-36 |
| 11. మా మాటలు | 37-39 |
| 12. జీవిత సభ్యులు | 40 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

### మనవి

**మీ వ్యాసాలు, ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేది లోపల పంపవలసింది. పత్రికను ప్రతినెలా 26న పోస్టు చేస్తున్నాం. 28వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# యువతకు ఆధ్యాత్మిక అవగాహన తరగతులు

## 2022 మే 27 నుండి 29 వరకు

అవతార్ మెహెర్‌బాబా పావగడ సెంటర్ ఆధ్వర్యంలో యువత కోసం ఆధ్యాత్మిక అవగాహన తరగతులు 2022 మే 27 నుండి 29 వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీ ఎ ఎం రఘుపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు వాట్సప్ నంబరు - 9449697972 లేదా శ్రీ ఎ ఎం రఘుపతి నాయుడు, 9880462970 సంప్రదించగలరు.

# మెహెర్‌బాబా పత్రిక

అవతార్ మెహెర్‌బాబా సందేశవ్యాప్తికి అంకితమైన పత్రిక మెహెర్‌బాబా. మీ బంధువులకు స్నేహితులకు పత్రికను బహుమతిగా పంపండి. పత్రిక పదివేల సైన్యంతో సమానమన్నది ఆర్యోక్తి. గత నాలుగైదేళ్ళుగా వార్షిక సభ్యత్వం చెల్లించనివారికి 2022 మార్చి నుంచి పత్రికను పంపడం నిలిపివేసామని తెలియజేసుకుంటున్నాము. గతంతో పోల్చితే పత్రిక ముద్రణ ఖర్చులు అధికమయ్యాయి. కవర్ పేజి ముద్రణ మల్టీకలర్‌లో చేపట్టడంతో 2022 జనవరి నుండి ప్రతినెలా వెయ్యి ప్రతులకుగాను రూ. 8,500/- చొప్పున, అదనపు ప్రతి వంద ప్రతులకు రూ. 850/- చొప్పున చెల్లిస్తున్నాం. గతంలో వెయ్యి ప్రతులకు గాను రూ. 4,800/- మాత్రమే చెల్లించేవాళ్ళం. పత్రిక రేట్లు గణనీయంగా పెరిగాయి. సక్రమమైన ఆర్థికస్వావలంబన కరువై, చరిత్రలో ఎన్నో పత్రికలు మరుగున పడ్డాయి. 2002 మే నెలలో ప్రారంభించిన మెహెర్‌బాబా పత్రిక వార్షిక, జీవితసభ్యత్వంలలో ఎలాంటి మార్పు చేయలేదు. పాఠకులు గమనించగలరు. జైబాబా. - ఎడిటర్

# రాజమండ్రి బాబా కేంద్రం - వేసవి తరగతులు

## 2022 మే 9 నుండి జూన్ 12 వరకూ

రాజమండ్రి బాబా కేంద్ర ఆధ్వర్యంలో బాలబాలికలకు ప్రత్యేక వేసవి తరగతులు 2022 మే 9 నుండి జూన్ 12 వరకూ నిర్వహిస్తున్నట్లు, కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బాబావారి సందేశాలపై ప్రసంగములు, ఇంగ్లీషు గ్రామర్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 98481 37379 లేదా 98496 31507 సంప్రదించవల్సిందిగా కోరుతున్నారు.

# సంపాదకీయం 22వ సంవత్సరంలో

మెహెర్‌బాబా పత్రిక ప్రారంభించి నేటికి 21 సంవత్సరాలు నిండాయి. 2001 మే 12న తొలి సంచిక వెలువడింది. హైదరాబాద్‌లోని కోఠి సెంటర్‌లో శ్రీమతి నోరి ప్రభాకరమ్మ లాంఛనంగా మెహెర్‌బాబా పత్రికను అవిష్కరించారు. తొలి ప్రతిని శ్రీ యం.వి.బి.ఆర్. శర్మకు అందజేశారు. అవతారుని కృప వల్ల నాటి నుండి క్రమం తప్పక సరైన సమయానికి ఠంచనుగా పోస్టలు బట్వాడా చేస్తున్నాం. పాఠకులందరికీ పేరు పేరునా హృదయపూర్వక జైబాబా. ఈ సందర్భంగా పత్రిక వ్యవస్థాపకులు శ్రీ దశిక ప్రసాదరావు గారిని మనసారా స్మరించుకుందాం.

**కొత్త పుస్తకం**

ఈ శుభతరుణంలో "మెహెరాబాద్ సహవాస్, 1958 ఫిబ్రవరి" మకుటంతో ఈ తరం యువతకు ప్రత్యేకంగా పత్రిక తరఫున బాబా కానుకగా త్వరలో అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. మెహెర్‌బాబా అనేక ఆధ్యాత్మిక విషయాలు వెల్లడించారు. ఆయన స్పృశించని అంశం ఏదీ లేదనే చెప్పాలి. అణుబాంబుకన్నా శక్తివంతమైన అనేక ఆధ్యాత్మిక అక్షరాయుధాలు అనేక వందల సంపుటాలలో బాబా ఈ తరానికి అందజేశారు. ఆంగ్లంలో అధికంగా వున్న ఈ సమాచారాన్ని తెలుగులో మాత్రమే చదివి అర్థం చేసుకోగల వారి కోసం మెహెర్‌బాబా పత్రిక సహాయంతో గత రెండు దశాబ్దాలుగా అందజేసే ప్రయత్నం చేస్తున్నాం.

**ఇప్పటిదాకా**

ఇప్పటిదాకా రమారమిన 10 వేల పేజీలకు పైగా అవతారుని సాహిత్యం పాఠకులకు అందజేశాం. అందులో ముఖ్యంగా, **న మే భక్త ప్రణశ్యతి** శీర్షికతో 2010 జనవరిలో, **సర్వధర్మాన్ పరిత్యజ,** 2012 జూలైలో, **సార్థకజన్ములు** 2013 నవంబరులో, **దేవుని సన్నిధిలో**, 1955 నవంబరు మెహెరాబాద్ సహవాస్ విశేషాలను, 2017 జూన్, **ధన్యచరితులు** –2018 మే 19న, **"సద్యః ఫలితం"** 2021 ఆగస్టులో ప్రచురించి పాఠకులకు సాదరంగా అందజేశాం.

కాగా, శ్రీ మల్లాది రామారావు గారి ధారావాహిక సీరియల్‌గా ప్రచురిస్తున్న లార్డ్ మెహెర్ – (1925–1935), అవతారుని సందేశాలతో కూడిన **"త్వమేవ శరణం"** అనే మరో ఉద్గ్రంథం ప్రచురణకు సిద్ధంగా వున్నాయి.

మహా సముద్రంలోని నీటిని తోడివేయడం ఎంత అసాధ్యమో, అవతారుని సాహిత్య ప్రచురణ బాధ్యత కూడా అలాంటిదే. పత్రిక ఒక వారధిలాంటిది. మెహెర్‌బాబా పత్రికను మీ ఎరుకలోని వారందరికీ అందజేయండి. తద్వారా బాబా నామవ్యాప్తికి సహాయపడవల్సిందిగా వినమ్రంగా కోరుతున్నాం.

***

# అక్బర్ కృష్ణ



శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ బాబా ప్రేమికులందరికీ సుపరిచితులే. అవతారుడు ఆంధ్రా పర్యటనలో భాగంగా తొలిసారిగా వారింటిని సందర్శించారు. పలుమార్లు బాబావారి దర్శన, ఆలింగన భాగ్యం పొందిన ధన్యులు. వీరి తండ్రి శ్రీ కుటుంబశాస్త్రి 1950వ దశకం నుండి అవతారునికి నీడలా వుండి జీవిత చరమాంకం వరకూ బాబా సేవలో తరించిన ధన్యశాలి. బాబా ప్రేమ – సేవలో శ్రీ అక్బర్ తన అనుభవాలను క్లుప్తంగా ఇటీవల మెహెర్‌బాబా ప్రతినిధికి తెలిపారు. ఆ విషయాలను ప్రత్యేక శీర్షికగా ఈ సంచికలో అందించే ప్రయత్నం చేస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు. ఇకపై శ్రీ అక్బర్ కృష్ణ మాటల్లోనే తెలుసుకుందాం!! – ఎడిటర్

***

**అవును!!** నా పేరు చాలామందికి వింతగానే అగుపిస్తుంది. దీనికో చిన్న కథ వుంది. అదేమిటో క్లుప్తంగా చెప్తాను. 1950వ దశకం వరకూ మా నాన్న శ్రీ తాడిమేటి కుటుంబ శాస్త్రి. థియోసాఫికల్ సొసైటిలో ప్రధాన భూమిక పోషించారు. డాక్టర్ అనిబిసెంటు, జార్జి ఆరండేల్, జినరాజదాస, జిడ్డు కృష్ణమూర్తి తదితరులతో సన్నిహిత స్నేహం ఆయనకు వుంది. మేం మద్రాసులోని అడయార్ థియోసాఫికల్ సొసైటి క్వార్టర్స్‌లో చాలా కాలం వున్నాం. “సత్య నాస్తి పరో ధర్మ” ఇదీ థియోసాఫికల్ సొసైటి వారి లక్ష్యం. సత్యాన్ని మించిన మతమంటూ ఏమీ లేదన్నది వారి ఆశయం. అలాగే **“నా విష్ణు: పృధ్వీ పతి:”** అని మా నాన్న చాలా గట్టిగా నమ్మేవారు. విష్ణువు సర్వ వ్యాపకుడు. రాజు విష్ణు స్వరూపుడని, విష్ణువు అంశలేనివాడు రాజు కాలేడని వేదాలు ఘోషిస్తున్నాయని మా నాయన అనేవారు. ఆ నమ్మకంతోనే నా బారసాలనాడు మా నాన్న తన ఒడిలో కూర్చోబెట్టుకుని, బంధుమిత్రులు, పండితులందర్నీ ఆశ్చర్యపరిచేలా **మొఘలు చక్రవర్తి “అక్బర్”**

పేరిట నామకరణం చేశారు. అక్బరు ముస్లిం మతస్తుడు. ఐనప్పటికి ఆయన తన మతంపై వీరాభిమానం చూపించలేదు. ఇతర మతాల్ని కించపరచలేదు. విలక్షణమైన వ్యక్తి అక్బరు అని దివ్యజ్ఞాన సమాజ కార్యకర్తగా నాకు ఆ పేరుపెట్టారు. పండిత, సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబీకులైన మా బంధువర్గం అందరూ ఒక ముస్లిం వ్యక్తి పేరుపెట్టినందుకు చేయవల్సిన గలాటా అంతా చేశారట. ఆ తర్వాత, కొంతమంది పెద్దల ప్రమేయంతో "కృష్ణ" నామాన్ని జోడించి అక్బర్ కృష్ణగా నామకరణ మహోత్సవం పూర్తిచేశారు. నేను 1944 జూన్ 16న గోదావరి జిల్లాలోని నిడదవోలు గ్రామంలో పుట్టాను. గోదావరి జిల్లాలోని సనాతన సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబాలు ఎంత పట్టింపుతో వుండేవారో ఊహించనలవి కానిదేమి కాదు. ఏదిఏమైనా మా నాన్న తాను నమ్మినదానికి కట్టుబడి వుండేవారు. నిజాయితీ, ముక్కుసూటితనం ఆయన సొంతం. అందుకే నాకు ఆయన ప్రథమ గురువులు. అలాగే, మా అన్నయ్య పేరుని జార్జి భాస్కర్ రాజా అని దివ్యజ్ఞాన సమాజ పెద్దలు డాక్టర్ జార్జి ఆరండేల్, జినరాజదాస పేర్లు కలిసివచ్చేలా పెట్టారు. దివ్యజ్ఞాన సమాజంలో ఆయనకున్న నమ్మకానికి ప్రతీకగా మా పేర్లు అలా పెట్టారని చెప్పాలి. ఆ తర్వాత బాబా దర్శనం చేసుకున్నాక ఆయన అవతారుని సేవకే అంకితమయ్యారు. అవతారుని పరిధిలోకి వచ్చాక, ఇప్పటి దాకా దివ్యజ్ఞాన సమాజానికి సేవ చేశావ్. ఇకపై నన్ను సేవించు. ఆ సమాజం కూడా నాకే చెందినదని బాబా స్పష్టం చేశారు.

**బాబా దర్శనం**

1953 జనవరిలో బాబావారి ప్రథమ ఆంధ్రా పర్యటనలో భాగంగా నిడదవోలులో వున్న మా ఇంటికి వచ్చారు. అప్పుడు నాకు ఎనిమిదేళ్ళు. బాబా నా ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసుకుని ముద్దాడారు. ఈనాటికీ ఆ మధుర క్షణాలను నేను మరిచిపోలేదు. ఆ తర్వాత నేను ఎన్నో బాబా కార్యక్రమాలలో పాల్గొన్నాను. బాబా సందేశాలపై రాసిన నాటికలు ప్రదర్శించాము. **"దివ్య జ్ఞాన దీపిక"** పేరుతో లిఖిత మాసపత్రిక నొకదాన్ని ప్రచురించాము. అనేక బాబా నామవ్యాప్తి కార్యక్రమాలు చుట్టుప్రక్కల వున్న గ్రామాల్లో చేపట్టాను. 1953 ఏప్రిల్ 10న ఆంధ్రా మెహెర్ సెంటర్ ప్రప్రథమ సమావేశం నిడదవోలులో మా ఇంట్లోనే మా నాన్న గారి ఆధ్వర్యంలోనే జరిగింది. ఈ సమావేశానికి మెహెరాబాద్ నుంచి మండలి సభ్యులైన ఏరుచ్, పెండూలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలోనే అవతారుని రెండవ దఫా ఆంధ్రా పర్యటన తేదీలు వగైరా కార్యక్రమాలు ఖరారు చేసారు. 1960 నుండి ఏడాదిలో ఒకసారైనా బాబాని దర్శించుకున్నాం. ఆ అనుభవాలు – అనుభూతులు చెప్పాలంటే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది.

## బాబా నాకు ఉద్యోగం ఇప్పించారు

1966లో బి.ఎస్సీ డిగ్రీ పరీక్షలు రాసాను. ఆ తర్వాత స్వామి సత్య ప్రకాశ్ ఉదాసీన్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఒక పెద్ద ప్రేమిక సహవాస్‌కు హాజరయ్యాను. ఆ కార్యక్రమానికి మా అన్నయ్య భాస్కర రాజా, బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానితో కలిసి హైదరాబాద్ వచ్చాడు. మా అన్నయ్య అప్పటికే ఆదీ గారి కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌లో సహవాస్ ముగిశాక నన్ను మా అన్నయ్య తనతో అహ్మద్‌నగర్ తీసుకెళ్ళాడు. అలా వెడుతూ ముందుగా బాబావారి దర్శనం చేసుకుందామని గురుప్రసాద్, పూణేకి వెళ్ళాం. బాబాని దర్శించుకునే సమయంలో బాబా నాకేసి చూస్తూ ఏం చేస్తున్నావ్? అని కుశల ప్రశ్నలు అడిగారు. డిగ్రీ పరీక్షలు రాశానని చెప్పాను. ఆ పిదప ఏం చేయాలనుకుంటున్నావ్? అని సంజ్ఞలతో ప్రశ్నించారు. ఎం.ఎస్సీ చేద్దామనుకుంటున్నానన్నాను. అలాగా? అన్నట్లు నాకేసి చిరునవ్వుతో చూశారు. ఆ సమయంలో నాకేమీ తెలియలేదు కాని,
ఆ పిదప, బాబా తన కార్యదర్శి ఆదీ కె ఇరానిని పిలిచి నా గురించి ఏదో చెప్పారు. ఆ దరిమిలా ఒకరోజున అహ్మద్‌నగర్‌కు సమీపంలో వున్న ఒక ఫార్మాసూటికల్ కంపెనీ యజమానితో ఆదీజీ సంప్రదించారు. ఆ దరిమిలా, ఆ కంపెనీలో కెమిస్ట్‌గా ఉద్యోగంలో చేరాను. అవతారునికి తెలియనిదేముంది? బాబా వారి చిరునవ్వులకిది సంకేతమని ఆ తర్వాత నాకు తెలిసింది. ఆ కంపెనీలో కెమిస్ట్‌గా రెండు సంవత్సరాలు చేశాను. ఆ తర్వాత ఒకరోజున బాబా మండలి సభ్యుడైన సరోష్ ఇరానీ, అహ్మద్‌నగర్‌లో వున్న తన ఆఫీసులో నన్ను స్థానిక దేనా బ్యాంకు మేనేజర్‌కు పరిచయం చేసారు. ఆయన పూణేలో దేనా బ్యాంకులో ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఏర్పాటు చేసారు. ఆ తర్వాత 1968 ఆగస్టులో దేనా బ్యాంకులో టైపిస్టు కం క్లర్క్‌గా మహారాష్ట్రలోని నాందేడ్ బ్రాంచ్‌లో ఉద్యోగంలో చేరాను. 1969 వరకూ అక్కడ పనిచేశాను. ఆ సమయంలోనే ఆదీ కె ఇరానీతో కలిసి మా నాన్న నిజామాబాద్ తదితర తెలుగు ప్రాంతాల పర్యటనలకు వెళ్తూ, ముందుగా నాందేడ్‌లో మా బ్యాంకుకు ఆకస్మికంగా వచ్చారు. ఆ సమయంలోనే మా నాన్న గారు నా వివాహ ప్రస్తావన చేసారు. నేను కాదనలేదు. 1969 జనవరిలో బాబా దేహత్యాగం చేశారు. నేను ఆ ఏడు రోజులూ బాబా సమాధి దగ్గరే వున్నాను. ఆ దరిమిలా 1969 డిసెంబరు 4న నా వివాహమయింది. ఆ సమయంలో మెహెరాజాద్ నుండి బాబా నాకు పెళ్ళి కానుకగా వెయ్యి రూపాయలు మండలి సభ్యుడైన ఏరుచ్‌తో పంపారు. బాబా నా కోసం ఆ నగదు ముందుగానే నిర్ణయించినట్లు (**యాజ్ వజ్ విష్డ్ బై బాబా** అని శుభాకాంక్షలతో



## పెళ్ళి కానుక

ఏరుచ్ మాకు అందజేశారు. అప్పటికి బాబా భౌతికంగా మన మధ్యన లేరు. ఐనప్పటికీ, అవతారుడు తల్లిగా–తండ్రిగా తన పిల్లల కోసం అన్నట్లు, తన మండలికి ముందుగానే నా వంటి అల్పప్రాణిని గుర్తుంచుకుని **పెళ్ళి కానుక** పంపారు. సర్వజ్ఞుడైన బాబా తన ప్రేమికుల పట్ల ప్రతి చిన్నవిషయాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటారో అర్థమౌతుంది. ఇది సామాన్యుల తరమా? 1971లో నేను అహ్మద్‌నగర్ దేనా బ్యాంకు బ్రాంచీకి బదిలీ అయ్యాను. 1980 దాకా నగర్‌లోనే పనిచేసాను. ఖుస్రూ క్వార్టర్‌లో మా బస వుండేది. భావూజీ, డాక్టర్ డాంకిన్, పాద్రీ, పెండూ, ఛగన్ మాస్టార్, జంగ్లే మాస్టార్, ఫ్రెరం బాక్స్‌వాలా, నానాఖేర్, విష్ణు మాస్టారి సోదరి, ఇలా పలువురి బాబా మండలి ప్రేమికుల స్నేహపూర్వక వాతావరణంలో మా జీవనం గడిచింది. ఆదీ కె ఇరాని తల్లి గుల్మాయి ఒక సందర్భంలో ఖుస్రూ క్వార్టర్స్‌లోని మా ఇంటికి కూడా వచ్చింది. అలా పలువురి పెద్దల సరసన ప్రేమతో మెలిగే భాగ్యం మాకు లభించింది. ఆ తర్వాత, 1981లో ప్రమోషన్‌తో నన్ను ఔరంగాబాద్ బదిలీ చేశారు. ఆ తర్వాత్తర్వాత మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో పలు దేనాబ్యాంకు బ్రాంచీలలో ఉన్నతాధికారిగా పనిచేసాను. 2001లో జాతీయ బ్యాంకులలో స్వచ్ఛంద పదవీ విరమణ పథకం ప్రకటించడంతో నేను విఆర్ఎస్ తీసుకున్నాను. ఆనాటి నుండి నేను, నా భార్య కాత్యాయని బాబా నామస్మరణలో కాలం గడుపుతున్నాం. అవతార నామస్మరణ తప్ప మాకు మరో వ్యాపకం లేదు. శ్రీమతి కాత్యాయని 2004 డిసెంబరు నుండి, అంటే ఒకటిన్నర దశాబ్దం పైగా అవతారుని నామస్మరణలో నిరంతర మౌనం పాటిస్తోంది. మాకు పిల్లలు లేరు. అవతారుడే మా సర్వస్వం. 2001 నుండి బాబా కార్యక్రమాల్లో మండపేటలోని ఆశ్రమ జీవితం గడుపుతున్నామని శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ తన స్వగతం ముగించారు. ఐతే, ఇంతటి పరిపూర్ణ ప్రేమికుడైన శ్రీ అక్బర్ మండపేట ఆశ్రమాన్ని ఆశ్రయించడంపై అవతారుని ప్రేమిక బృందంలో బిన్నాభిప్రాయాలున్నాయి. ఇది వారి జీవన గమనంలో మరో పార్శ్వం.
**నాణేనికి మరో కోణం అనొచ్చు.**

## తల్లి బాధ

అది 1960 మే 26వ తేది. మా కుటుంబ సభ్యులందరం బాబా వారి దర్శనం చేసుకున్నాం. ఆనాడు మా దర్శనం పూర్తయ్యాక, అందరం వెనుతిరిగినా, మా అమ్మ వచ్చీరాని ఇంగ్లీషులో బాబావారి ఎదుటనే వుండి ఆయనకేదో చెప్తోంది. మా అమ్మ మాటల్ని బాబా ఆలకిస్తూ, బాబా మా నాన్న గార్ని తన దగ్గరకి పిలిచారు. ఆమె ఏం చెప్తోందని అడిగారు. అదేమంత ముఖ్యమైంది కాదులే బాబా అన్నట్లు మాటతప్పించబోతే, బాబా రెట్టించి అడిగేసరికి, మరోమార్గంలేక, మా అమ్మాయి పెళ్ళి ఆలస్యమయ్యింది. అమ్మాయికి 26 ఏళ్ళు వచ్చాయి. తల్లి కదా!! నీ కృప కోరుతోందన్నారు మా నాన్న. ఎందుకింత ఆలస్యం చేశావ్? అని బాబా అడిగేసరికి, అవతారుని ఎదుట అసత్యం చెప్పలేక మా నాన్న ఉన్నదిఉ న్నట్లు చెప్పారు. తాను కట్నం ఇవ్వను. కట్నం తీసుకోనని డాక్టర్ అనిబిసెంట్‌కి ప్రమాణం చేశాను. ఈ విషయం అందరికీ తెలిసిపోయింది. దీంతో ఎవరూ ముందుకు రావడం లేదని నవ్వుతూ చెప్పారు. బాబా ఒక్క క్షణం ఆగి, నీవు కట్నం తీసుకోకపోయినా, ఇవ్వవల్సివచ్చినప్పుడు తప్పదు కదా అని కోప్పడ్డారు. నేను చూసుకుంటానులే అన్నట్లు బాబా మా అమ్మకు అభయమిచ్చారు. బాబా కృప ప్రసరించినట్లుగా, అదే సంవత్సరం అన్నివిధాల తగిన వరుడితో సెప్టెంబరు 23న వైభవంగా పెళ్ళి జరిగింది. నేడు వారంతా సుఖంగా బాబా నామస్మరణలో గడుపుతున్నారు.

## సాహిత్యసేవ

అవతారుని సాహిత్యంలో అత్యంత క్లిష్టమైన గ్రంధాలు 1. "ఇన్ఫినిట్ ఇంటెలిజెన్స్" గ్రంధాన్ని **అనంత ప్రజ్ఞ** పేరిట శ్రీ అక్బర్ కృష్ణ తెలుగులో అనువదించారు. 2. డాక్టర్ విలియం డాంకిన్ రాసిన "ది వేఫేరర్స్" గ్రంధాన్ని తెలుగులో బాటసారులు పేరిట అనువదించారు. అలాగే, 3) హౌ ఎ మాస్టర్ వర్క్స్ గ్రంధాన్ని "సద్గురు కార్యసరళి" పేరుతో, భావూజీ విరచిత "అవతార్ ఆఫ్ ది ఏజ్– మెహెర్‌బాబా– మానిఫెస్టేషన్ గ్రంధాన్ని **"యుగావతార్ మెహెర్‌బాబా వ్యక్తీకరణ" పేరిట** తెలుగులో అనువదించి బాబా ప్రేమికలోకానికి అందజేశారు. అలాగే, ఫ్రాన్సిస్ బ్రాబజాన్ రాసిన "స్టే విత్ గాడ్"ఆంగ్ల పద్య కావ్యాన్ని కూడా అనువదించి ప్రచురణకు సిద్ధంచేసినట్లు భోగట్టా. ఈ రచనకు ఆస్ట్రేలియా బాబా కేంద్రం అనుమతించాల్సి వుందని శ్రీ అక్బర్ చెప్పారు. అవతారుని ఆధ్యాత్మిక సందేశాలతో కూడిన సాహిత్యాన్ని ఆసాంతం చదివిన బహుకొద్దిమంది బాబా ప్రేమికులలో అక్బర్ ఒకరని చెప్పొచ్చు.

***

# మెహెరాజాద్ మండలి హాలు



మెహెర్‌బాబా భౌతికంగా మన మధ్యన 1969 జనవరి 31 దాకా వున్నారు. ఆనాడు మెహెర్‌బాబా కార్యస్థానం అహ్మద్‌నగర్‌కు సుమారు 15 కిమీ దూరంలో వున్న మెహెరాజాద్. ఇక్కడున్న మండలి హాలులో బాబా తన మండలివారితో ప్రతినిత్యం సమావేశమయ్యేవారు. వారికి తగిన సందేశాలు, ఆదేశాలు ఇస్తుండేవారు. మెహెరాజాద్‌లో మెహెర్‌బాబా, అలాగే, మండలి సభ్యులందరూ కూడా బహూ నిరాడంబరమైన జీవనం గడిపారు. **"నిరాడంబరత"** అనే పదానికి నిర్వచనంగా వారి జీవన విధానం వుండేదని, బాబా ప్రేమికులందరికీ బాగా తెలుసు. కాగా ఒక సందర్భంలో, మెహెరాజాద్‌లో ముఖ్యమైన ప్రాంగణం **"మండలి హాలు"** ఏర్పాటు గురించి మండలి సభ్యుడైన ఏరుచ్‌ని అడిగినప్పుడు, ఆయన అనేక ఆసక్తికర విషయాలు చెప్పారు. 2021 గ్లో మాస పత్రికలో ప్రచురితమైన ఈ అంశాలకు స్వేచ్ఛానువాదంగా మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రత్యేకంగా అందజేస్తున్నాం. ఇకపై ఏరుచ్ మాటల్లోనే ఆ విషయాలు తెలుసుకుందాం. దయచేసి పరిశీలించండి.

***

మెహెర్‌బాబా నవజీవన కార్యక్రమంలో భాగంగా తన పేరిట వున్న స్థిర, చరాస్తులన్నింటినీ అమ్మివేసారన్న విషయం పాఠకులకు తెలుసు. ఈ నేపథ్యంలోనే మెహెరాజాద్‌లో తన వద్ద వున్న రెండు కార్లను అమ్మివేయమని బాబా ప్రేమికుడైన



సరోష్ ఇరానీని ఆదేశించారు. ఆ రోజుల్లో సరోష్ ఇరానీ అహ్మద్‌నగర్‌లో కార్ల వ్యాపారం చేస్తుండేవాడు. ఆ మాదిరిగా మెహెరాజాద్‌లో కార్ల కోసం నిర్మించిన గ్యారేజి ఖాళీ అయింది. ఆ దరిమిలా, బాబాతో కలిసి మేమందరం నవజీవనంలో పాల్గొన్నాం. దాదాపు ఆ సమయంలోనే బాబాకు ఒక ప్రేమికుడు ఒక ఆడ గుర్రాన్ని బహుకరించాడు. దానికి “షీబా” అని పేరు పెట్టారు. ఆ తర్వాత ఆ అశ్వాన్ని మెహెరాజాద్‌కి పంపివేశారు. ఆ గుర్రం కోసం ఒక గదిని ఆదరాబాదరాగా నిర్మించాల్సివచ్చింది. కేవలం మట్టితో గోడలు కట్టి ఒక తాత్కాలిక గదిని షీబా కోసం ఏర్పాటు చేశారు. ఈ గదిలో ఎక్కడా సిమెంటు వాడలేదు. ఈ గదికి కిటికీలు, గుమ్మాలు లాంటివి కూడా ఏమీ లేవు. కేవలం తాత్కాలిక నిర్మాణం పూర్తయిందనిపించాం. దీని ఎత్తు కూడా చాలా కిందిగా వుండింది. గుర్రం కోసం గది ఏర్పాటయ్యిందంటే, అయిందనిపించి, షీబాని ఇక్కడ వుంచారు. స్త్రీ మండలి ఈ గుర్రాన్ని ప్రేమగా చూసుకుంది. చాలా అందంగా పెరిగి పెద్దదయింది షీబా. ఐతే, భవిష్యత్తులో ఈ అశ్వాన్ని పోషించడం మరింత భారమౌతుందన్న వుద్దేశ్యంతో, ఆ గుర్రాన్ని ఒక మిలిటరీ అధికారికి అప్పజెప్పారు. దాంతో మెహెరాజాద్‌లో ఈ గది ఖాళీ అయింది. నవజీవన కార్యక్రమం పూర్తయ్యాక, మెహెరాజాద్‌లో వుండగా ఒకరోజున బాబా మమ్మల్ని అందర్నీ ఈ గదికి పిలిచారు. ఆయన ఒక మూలగా నేలపైనే కూర్చున్నారు. కుర్చీలాంటిది కూడా ఏమీ ఏర్పాటు చేయలేదు. బాబాకి ఎదురుగా మేం కూర్చున్నాం.



బాబా నన్ను మెహెరాజాద్‌కి వచ్చిన ఉత్తరప్రత్యుత్తరాలు తీసుకురమ్మనమన్నారు. ఇక్కడ్నుంచి పనిచేద్దాం అన్నారు. ఇదేదో కొత్త మురిపంలే అనుకున్నాం. కాని అలా జరగలేదు. ఆ మర్నాడు, ఆపై రెండు, మూడో రోజు కూడా బాబా తన పనిని ఈ గదిలోనే చేశారు. ఆ తర్వాత, మేం ఈ గదిని శుభ్రం చేశాం. ప్రతిరోజూ మండలివాళ్ళందరం ఇక్కడ బాబా ఎదుట హాజరయ్యాం. దీనికి మెహెరాజాద్ మండలి హాలుగా గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఈ గదికి ఒక గుమ్మం పెట్టించమన్నారు. కిటికీలు మాత్రం వద్దన్నారు. కిటికీలు తెరిచి వుంచితే, బైట నుండి శబ్దాలు వస్తాయన్నారు. ఆ తర్వాత ఈ గది ఎత్తుని కొద్దిగా పెంచాం. ఎందుకంటే ఒక్కొక్కసారి శ్వాస ఆడనట్లుండేది. ఆ తర్వాత బాబా ఈ గదికి ఎలాంటి మరమ్మత్తులు చేయించొద్దన్నారు. కనీసం సున్నం కూడా వద్దన్నారు. ఎందుకు తొందర? అనేవారు. మునుముందు మంచికాలం వుందిలే అన్నారు. ఈ గదికి మండలి సభ్యుడైన కాకాబారియాను ఇన్‌చార్జ్‌గా నియమించారు. కాకాబారియా ఒత్తిడి చేస్తుంటే, ఒకసారి బాబా మస్తు పర్యటనకు వెళ్ళినప్పుడు, ఆయన తిరిగి వచ్చేలోగా పాత కిటికీలు తీసుకొచ్చి సరోష్, ఆదీ, పాద్రీ తదితరులు అమర్చారు. ఈ గదిని మీరెప్పుడైనా నిశితంగా పరిశీలించండి. చాలా గమ్మత్తుగా అగుపిస్తుంది. ఇక్కడ వున్న కిటికీలు ఒకటి ఎత్తుగా, మరొకటి చిన్నదిగా రకరకాల సైజుల్లో కనిపిస్తాయి. ఆ మాదిరిగా కారు గ్యారేజి గుర్రపుశాలగా, ఆ పిదప మండలి హాలుగా రూపాంతరం చెందింది. ఆ తర్వాత, ఈ గదిలో ఒక మూలకు

బాబా కోసం ఒక కుర్చీని ఏర్పాటు చేసాం. బాబా అందులో కూర్చునేవారు. ఆయన ఎదురుగా నేల మీద మేం కూర్చునేవాళ్ళం. మా కోసం నేల మీద పాత గోనె సంచులు పరచుకునేవాళ్ళం. ఈ గోనె సంచులతోపాటు దుమ్ము రేగుతుండేది. దానికోసం నేలపై నీళ్ళు చిమ్మేవాళ్ళం. ఆ తడికి చీమలు, ఇతర చిన్న పురుగులు లాంటివి వచ్చేవి. దాంతో నేలమీద ఆవు పేడతో అలికేవాళ్ళం. దానివల్ల చలికాలంలో వెచ్చగా, ఎండాకాలంలో నేల చల్లగా వుండేది. బాబా ప్రతిరోజూ ఇక్కడికి వచ్చేవారు. ఇక్కడే తన ప్రేమికులకు దర్శనమిచ్చేవారు. ఏకాంతవాసంలో కూడా బాబా ఇక్కడ కొద్దిసేపు కూర్చునేవారు. తనకు వచ్చిన ఉత్తరాలు ఇక్కడే చూసి, తగిన జవాబులు ఇప్పించారు. ప్రపంచంలో వున్న తన ప్రేమికులందరికి ఇక్కడ నుంచే తన సందేశాలను టెలిగ్రాంలు, కేబుల్స్ ద్వారా పంపారు. ఆ మాదిరిగా ఈ గది మండలిహాలుగా, అవతారుని కార్యస్థానంగా, అధికారిక కార్యాలయంగా భాసించింది. 1950వ దశకంలో బాబాకు కారు ప్రమాదం జరిగాక, తగిన ట్రీట్‌మెంట్ ఇవ్వడానికై ప్రముఖ కీరోప్రాక్టర్ డాక్టర్ హారికెన్‌మోర్ అమెరికా నుంచి వచ్చాడు. ఆయనకు కంటిచూపు లేదు. గుడ్డివాడు. బాబా కోసం 13సార్లు అమెరికా నుంచి మెహెరాజాద్ వచ్చాడు. ఆయన తొలిసారిగా మెహెరాజాద్ మండలి హాలుకి వచ్చినప్పుడు, ఇక్కడున్న నేలపై బాబాకు వైద్యం చేయడంలో చాలా ఇబ్బంది పడ్డాడు. ఇది ఏ రకం ఫ్లోరింగ్ అని వాకబు చేసాడు. ఫ్లోరింగే లేదు!! అని నేను చెప్పగానే, డాక్టర్ హారికెన్‌మోర్ నిరుత్తరుడయ్యాడు. సాక్షాత్తూ దేవదేవుడు, ఈ యుగావతారుడి కొలువులో సరైన ఫ్లోరింగ్ కూడా లేకపోతే, మండలివారందరూ ఏం చేస్తున్నారని డాక్టర్ హారి నన్ను ప్రశ్నించాడు. ఈ విషయాన్ని నీవే బాబాని అడగమని చెప్పాను. దాంతో సాధారణ బండ రాళ్ళవంటివి పరిపించమని బాబా మమ్మల్ని ఆదేశించారు. అంతకుమించి ఏమీ వద్దన్నారు. ఈ రాళ్ళవల్ల చలికాలంలో చల్లగావున్నా, ఎండాకాలం వేడితో ఇబ్బందిగా వుండేది. ఈ రాళ్ళమీద కూర్చుంటే, చాలా గట్టిగా కూడా వుండేది. పాత గోనె సంచుల్ని తాళ్ళతో ఎడాపెడా కట్టి వాటిని మెత్తని సీట్లులాగా వాడుకున్నాం. బాబా భౌతిక దేహం వదిలేశాక, నేడు మీరు చూస్తున్న మెత్తని తివాచీలు ఏర్పాటయ్యాయి. అప్పటిదాకా, మేమందరం పాత గోనె సంచీలపైనే కూర్చునేవాళ్ళం అన్నారు ఏరుచ్. ఆ దరిమిలా, మండలి హాలుకి నిత్యం వచ్చే బాబా ప్రేమికుల సంఖ్య పెరిగింది. గోడలకు ఫోటోలు ఇతరత్రా అమర్చి మండలి హాలుని అందంగా తీర్చిదిద్దాం. ఏది ఏమైనా నేటికీ ఈ గది గోడలు గట్టిగా లేవు. ఎవరైనా గట్టిగా ఢీ కొడితే ఈ మట్టి గోడలు పడిపోవచ్చు. మీ అందరి ప్రేమవల్లనే ఈ గది ఇంకా గట్టిగా నిల్చిందని, ఏరుచ్ నవ్వుతూ ముగించారు....

***

# దర్పణ దర్శనం

## కళ్ళు తెరిచి దర్శించండి!!

మీరు బాబా ఎదుట దర్శనార్థం నిలబడినప్పుడు, రెండు చేతులూ జోడించి, **"కళ్ళు తెరిచి"** ప్రశాంతమైన మనస్సుతో అవతారుడ్ని దర్శించుకోండి. ఇలా ఎందుకు చెప్పాల్సివచ్చిందంటే, భగవంతుని ఎదుటకు పోగానే నూటికి 90 శాతం భక్తితో కళ్ళు మూసుకుంటాం. ఇది సరికాదని పెద్దల అభిభావన. ఆ దరిమిలా, అవతారుని దర్శనం పూర్తయ్యాక, దగ్గర్లోనే ఎక్కడైనా ప్రశాంతంగా కూర్చుని, అప్పుడు కళ్ళుమూసుకుని అవతారుడి రూపాన్ని గుర్తుకు తెచ్చుకుని, మనస్సులో మాట ఆయన ఎదుట వుంచమన్నది మన పెద్దల సూచన. ఆచరణలో ప్రయత్నించండి. ఆ అనందానుభూతి మీకే అవగతమౌతుంది. దీన్నే పౌరాణికులు **"దర్పణ దర్శనం"** అంటున్నారు. మనస్సు అనే దర్పణంలో దేవదేవుని దర్శించుకుని, తిరిగి ఆ దివ్యమంగళ స్వరూపాన్ని దహరాకాశాన ప్రతిష్ఠించుకునే ప్రయత్నమే ఈ ప్రక్రియ.

**తస్మాత్ జాగ్రత్త.**

శ్రీ తాడేపల్లి బసవయ్య, బందరు, పూణేలోని గురుప్రసాద్‌లో బాబాని దర్శించుకునే సమయంలో రెండు కళ్ళు గట్టిగా మూసుకుని రెండు చేతులూ జోడించి బాబాకు మనసారా నమస్కరించారట. ఆ పిదప, కొద్ది క్షణాల్లోనే ఆయన వెనుక క్యూలో వున్నవారు తొందరపెట్టేసరికి ప్రక్కకు తప్పుకున్నారు. ఎదరుగా దేవదేవుడు కనిపిస్తుంటే కళ్ళుమూసుకుని పొరపాటు చేశానని శ్రీ బసవయ్య తన జీవితాంతం బాధపడ్డారని, ఆయన భార్య శ్రీమతి సీతమ్మ చెబుతుండేవారు. ఈ కోవలో బాధితులు చాలామంది వున్నారు.

***

# వధువు కావలెను

అనంతపురం వాస్తవ్యులైన శ్రీ గోవిందప్ప గారి జేష్ఠ పుత్రుడు చి.మెహెర్ నిరంజన్ యాదవ్, (1992) ఎయిరోస్పేస్ ఇంజనీరింగ్ పూర్తి చేసి, బెంగళూరులోని ప్రముఖ ఆల్టన్ కంపెనీలో ఉన్నతోద్యోగం చేస్తున్నాడు. వీరికి తగిన వధువు కావలెనని తెలుపుతూ, బాబా ప్రేమికుల కుటుంబంలోనైతే బహు ఆనందదాయకం అన్నారు. మరిన్ని వివరాలకు 9703504377 సంప్రదించగలరు.

# బందరులో బాబా సహవాస్



అవతార్ మెహెర్‌బాబా మచిలీపట్నం సెంటరులో శ్రీ తాడేపల్లి బసవయ్య గారి భార్య శ్రీమతి సీతామహాలక్ష్మి గారి సంస్మరణార్థం 2022 ఏప్రిల్ 24న బాబా ప్రేమిక సహవాస్ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమం ఉదయం 5.30 నిముషాలకు నగర సంకీర్తనతో ప్రారంభమైంది. బాబా చిత్రపటాన్ని అందమైన పల్లకిలో వుంచి పట్టణ ప్రధాన వీధులలో బాబా నామసంకీర్తన నిర్వహించారు. సహవాస్‌కు విచ్చేసిన ప్రేమికులు, స్థానికులు పలువురు నగర సంకీర్తనలో పాల్గొన్నారు. అనంతరం బాబా ట్రస్టు సభ్యుడు శ్రీ మెహెర్ ప్రసాద రాజు సప్తవర్ణ పతాకావిష్కరణ చేసారు. ఆ పిదప, ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు ప్రేమిక సహవాస్ నిర్వహించారు. శ్రీ ప్రసాదరాజు, శ్రీ తోట నాగేశ్వరరావు, శ్రీ టి.ప్రసన్నకుమార్ శ్రీ కొఠారి రామకృష్ణ ప్రసాద్, శ్రీమతి సుబ్బలక్ష్మి, శ్రీ మెహెర్ బుజ్జి, శ్రీ దామెర విజయసారధి తదితరులు బాబావారి ప్రేమ సందేశములపై ప్రసంగించారు. కాగా, మల్లిక్ బృందం, కాకినాడ బాబా భజన గీతాలను ఆలాపించారు. శ్రీకాకుళం మెహెర్ విద్యావిహార్ బాలబాలికలు నృత్య ప్రదర్శనలతో ఆహుతుల్ని అలరించారు. శ్రీమతి తాడేపల్లి శ్యామల “మెహెర్ హౌజ్” అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్, విశాఖపట్నం, శ్రీకాకుళం, ధర్మవరం, విజయవాడ, చల్లపల్లి తదితర 30 సెంటర్ల నుండి సుమారు 900 మంది బాబా ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు భోగట్టా. చివరిగా, విచ్చేసిన సహవాసీలలో కొందరు బందరు బీచ్ విహార యాత్రలో పాల్గొని, అక్కడ కూడా బాబా నామసంకీర్తన, ప్రార్థనలు చేసారు. సహవాస్‌కి ముందురోజు అంటే ఏప్రిల్ 23న రాత్రి 7 నుండి రెండు గంటలపాటు శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా వారి ఇంటి వద్ద సత్సంగ్‌లో పాల్గొన్నారు. శ్రీ తాడేపల్లి మెహెర్‌బాబా, శ్రీమతి శ్యామల, శ్రీ కుమార్‌బాబు, శ్రీ మెహెర్ సుధాకర్, శ్రీ వేద శంకరరావు, తదితరులు సహవాస్ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సుమారు 12 గంటలపాటు నిర్విఘ్నంగా నిర్వహించిన బందరు ప్రేమిక సహవాస్ పదికాలాలపాటు గుర్తుండిపోయేలా ప్రేమికుల మదిలో నిలిచిపోయిందని పలువురు అభిప్రాయపడ్డారు. **సహవాస్‌లో పాల్గొన్న మెహెర్ బుజ్జి ఇలా చెప్పారు.....**



## సీతమ్మ గారి గురించి మెహెర్ బుజ్జి

సీతమ్మ గారు ఏడాదిలో తొమ్మిది నెలలు డి-హాస్టల్, మెహెరాబాద్‌లో వుండేవారు. ఆమె నన్ను సొంత కొడుకులాగా చూసుకునేది. ఆమె నిరంతరం బాబా నామస్మరణలోనే గడిపేవారు. అలాగే, అవతారుడు కూడా ఆమెని కంటికి రెప్పలాగా చూసుకున్నాడు. ఇందుకు రెండు గట్టి ఉదాహరణలు. 2012 ఆగస్టు ప్రాంతంలో ఆమె తెల్లవారుఝామున మసక చీకటిలో ఒంటరిగా బాబా సమాధికి బయల్దేరారు. నేను ముందుగా బాబా సమాధి డ్యూటికి వెళ్ళాను. ఆమె అలా వస్తూ, చూపు ఆనకనో, మరి ఏ కారణమో తెలియదు కాని, పచ్చని గడ్డితో కప్పివున్న ఒక చిన్న గుంటలో పడిపోయారు. జూలై, ఆగస్టు మాసాలలో మెహెరాబాద్ ప్రాంతం పచ్చని గడ్డితో ఉదయంపూట నీటి బిందువులతో ఆకుపచ్చగా మెరిసిపోతుంటుంది కదా!!. గోతిలో పడిపోయిన సీతమ్మ గారు **బాబా! బాబా!!** అని గొంతెత్తి బిగ్గరగా అరచినా జనసంచారం లేని ఆ సమయంలో ఆమె మాట ఎవరికీ వినపడలేదు. అలా ఆమె ఒంటరిగా బాధపడుతుంటే, ఎవరో ఒక ధవళ వస్త్రధారి, ఒక పెద్దాయన ఆ దారిన వెడుతూ ఆమెను చూసి, గోతి నుండి బైటకుతీసి, డి- హాస్టలు దాకా తీసుకొచ్చి దించి వెళ్ళాడని ఆమె నాతో చెప్పారు. ఆ తర్వాత ఆ పెద్దాయనకు టిఫిన్ పెడతామని ఆమె ఎంత వెదికినా దగ్గర్లో కనపడలేదని శ్రీమతి సీతమ్మ చెప్పారు. అవతారుడే పెద్దాయనగా వచ్చి రక్షించాడని, ఆమె తన రెండు చేతులూ జోడించారు. అలాగే మరో సందర్భంలో బహుశా అది 2009వ సంవత్సరంలో జరిగిందీ సంఘటన. ఆ సమయంలో ఆమె ఎప్పటిలా ఉదయాన్నే డి హాస్టలు నుండి బయల్దేరి ఎగువ మెహెరాబాద్‌కి వెళ్తున్నారు. ఆమెకు ఒక కంటిలో ఎప్పుడూ నీరు కారుతుండేది. ఆ కన్ను ఇరుకున పడినట్లుండేది. వినికిడి సమస్య బాధించేదామెని. ఈ విషయాలు తన కొడుకు మెహెర్‌బాబాతో చెబితే, బందరు తీసుకువెళ్ళిపోతాడని, ఆమె ఏమీ చెప్పేదికాదు. ఆ కంటి బాధవల్లనో ఏమో, దిగువ మెహెరాబాద్‌లో రైల్వే క్రాసింగ్ చేస్తుంటే, ఆవలగా వస్తున్న రైలు బండిని ఆమె గమనించలేదు. రైల్వే లైను క్రాస్ చేయబోయింది. ఇంతలో ఆ దారిన వస్తున్న ఒక వ్యక్తి, పెద్ద కర్రతో రైలు పట్టాలకు అడ్డంగా నిల్చుని సీతమ్మ గారిని పట్టాలు దాటించి, తాను ప్రక్కకు తప్పుకున్నాడు. ఆపై ఆ వ్యక్తి కోసం ఎంత వెదికినా కనపడలేదన్నారు సీతమ్మ. ఆమె ధన్యురాలు. బాబా నామస్మరణలో తరించిన పుణ్యజీవి అని సీతమ్మకు నివాళులు అర్పించారు శ్రీ మెహెర్ బుజ్జి.

# రాయలసీమ, సర్కారు జిల్లాలలో బాబా కేంద్రాలు

2021 నవంబరు నుంచి వరుసగా ప్రతి నెలా మెహెర్‌బాబా పత్రికలో తెలుగు రాష్ట్రాలలో వున్న బాబా కేంద్రాలు, ఆయా సెంటర్ల అధ్యక్ష, కార్యదర్శుల ఫోన్ నంబర్లు ప్రచురిస్తున్నాం. ఈ సమాచారం అత్యంత ప్రధానమని పలువురు పాఠకులు తెలిపారు. ఆ పరంపరలో ఆఖరిగా రాయలసీమ, సర్కారు జిల్లాల్లో వున్న బాబా కేంద్రాల వివరాలు ఈ నెల సంచికలో మీకందజేస్తున్నాం. ఇంతటితో ఈ శీర్షిక ముగిసింది. కాగా, దీనివల్ల ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏ జిల్లాలో ఎక్కడ బాబా కేంద్రం వుంది, ఆయా కేంద్రాల నిర్వాహకుల వివరాలు తేటతెల్లమయ్యాయి. తెలుగునాట మొత్తం 116 బాబా కేంద్రాలున్నాయి. ఈ వివరాలన్నీ అతిత్వరలో ఒకేచోట కనిపించేలా మెహెర్‌బాబా పత్రిక కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక వాట్సప్ గ్రూప్ (9959553218)లో ప్రచురించాలని భావిస్తున్నాం. గమనించగలరు.

**మీ సూచనలు, సలహాలను ఎప్పటిలా ఆహ్వానిస్తున్నాం. – ఎడిటర్**

| | | ప్రెసిడెంట్/సెక్రటరీ | ఫోన్ నెం |
|---|---|---|---|
| 1. | అనంతపురం | సుంకు కృష్ణమూర్తి | 94905 38799 |
| 2. | ధర్మవరం | పి.రమేష్ | 98859 40400 |
| 3. | హిందూపురం | ఎ.రామ్‌కుమార్ | 94913 19999 |
| 4. | కదిరి | ఎ.రామ్‌కుమార్ | 94913 19999 |
| 5. | పావగడ | ఎ.ఎమ్.రఘుపతినాయుడు | 80886 98900 |
| 6. | విశ్వ ఆధ్యాత్మిక కేంద్రం, భైరమంగళ | కె.సుబ్రమణ్యం<br>వి.దేవరావ్ | 63634 66453 |
| 7. | బెంగళూరు, జయనగర్ | శ్రీమతి నర్మద నగేష్ | 099805 22414 |
| 8. | గుంటూరు | బి. రామక్రిష్ణయ్య<br>డి. రంగబాబు | 95027 92213<br>98481 35189 |
| 9. | నర్సరావుపేట | నాగసరపు మెహెర్ విజయక్రిష్ణ<br>వంకాయల అచ్యుతరావు | 98661 31744<br>99892 43362 |
| 10 | ముటుకూరు | యాగంటి మెహెర్‌బాబా | 93470 82460 |
| 11. | చిలకలూరిపేట | మెహెర్ తేజ<br>మస్తాన్‌రావు | 83309 70302<br>92474 91125 |
| 12 | నెల్లూరు | చింతా సాయిబాబా | |
| 13. | సత్తెనపల్లి | | |

# బాబాలో ఐక్యం




## డాక్టర్ జెయస్ రాథోర్

మెహెరాబాద్ నివాసి డాక్టర్ జెయస్ రాథోర్, (88) మాజీ వైస్ ఛాన్సలర్, రేవా విశ్వవిద్యాలయం, (మధ్యప్రదేశ్) 2022 ఏప్రిల్ 21న బాబాలో ఐక్యమయ్యారని వారి కుమారుడు డాక్టర్ చిన్మయా రాథోర్ ఒక ప్రకటనలో తెలిపారు. అవతారుని సాహిత్యాన్ని ఆసాంతం ఆకలింపుచేసుకుని, నిరంతరం బాబా నామస్మరణలో గడిపిన శ్రీ రాథోర్ ధన్యులు అని స్థానిక బాబా ప్రేమికలు ఆయన సేవలను కొనియాడారు.

# శ్రీకాకుళం కేంద్ర నూతన కమిటి

శ్రీకాకుళం బాబా కేంద్ర సర్వసభ్య సమావేశంలో 2022–2025 సంవత్సరాలకు గాను నూతన కమిటి ఎన్నిక 2022 ఏప్రిల్ 17న జరిగింది. కాగా, ఈ ఎన్నికలో కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినట్లు ఒక ప్రకటనలో తెలిపారు

**గౌరవ అధ్యక్షులు:** శ్రీ గుడ్ల సత్యనారాయణ

**అధ్యక్షులు:** శ్రీ పి.వి.రంగప్రసాదరావు, **ఉపాధ్యక్షులు:** శ్రీ పి.భాస్కరరావు, శ్రీ ఎం.బి.వెంకటేశ్వరరావు (రాజు), **కార్యదర్శి:** శ్రీ బి.ఎస్.ఎస్. వరప్రసాదరావు (సాయి), **ఉప–కార్యదర్శులు:** శ్రీమతి ఏ. లలిత కుమారి, శ్రీ ఎన్.వి.సురేష్,

**కోశాధికారి:** శ్రీ పి. శంకరరావు,

**కార్యనిర్వాహక సభ్యులుగా:** శ్రీమతి కె.విజయలక్ష్మి, శ్రీమతి బి.నిర్మల, శ్రీమతి ఎన్. సరోజ, శ్రీ గుడ్ల కామేశ్వర రావు, శ్రీ బి.వి.వి.సూర్యనారాయణ, శ్రీ జి.ఎస్.ప్రకాశరావు, శ్రీ పి. తిరుమల బాబు, శ్రీ ఎన్. నాగభూషణం, శ్రీ ఎం. శ్రీనివాసరావు, శ్రీ ఎస్. అప్పారావు, శ్రీ ఎం. ధనుంజయ ఎన్నికయ్యారు.

# మెహెర్‌బాబా పత్రిక కోసం

మెహెర్‌బాబా పత్రిక ప్రచురణ ఖర్చుల నిమిత్తం బాబా ప్రేమికులు (తమ పేరు ప్రచురించవద్దన్నది వారి అభ్యర్థన) రూ 10,000/–, అలాగే, శ్రీ కెఎల్ రామకృష్ణమూర్తి, తాపేశ్వరం, తూగోజి రూ. 1000/– పత్రిక ఖర్చుల కోసం పంపారు. పత్రిక తరపున వారి కుటుంబసభ్యులకు జైబాబా. ధన్యవాదములు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్,
మెహెరాబాద్

(గత సంచిక తరువాయి)

1931 నవంబర్ 12,13,14 తేదీల్లో బాబావారు చాలా మందికి
దర్శనమిచ్చారు హర్మాన్‌లో. కిట్టీ చెల్లెలు ఏంజెలా లాయ్ బెర్ట్ సహా
మొత్తం 13 మంది ప్రభువుని దర్శించి ఆశీస్సులు పొందారు.
లామ్ బెర్ట్ చెవిన బాబా నామం లండన్‌లో పడింది.
కానీ దర్శనం దొరకలేదు. ఆ లోటు యిప్పుడు యిక్కడ హర్మాన్‌లో తీరింది.
హెన్రీ స్టీగ్నెర్ కూడా బాబా వారిని దర్శించి తరించారు.
ఈ హెన్రీ గారి పుట్టుపుర్వోత్తరాలని చరిత్రకారుడు ఎక్కడా చెప్పలేదు.
ఈయనే కాదు, బాబావారిని కలిసిన మరికొందరి వివరాలు కూడా
ఎక్కడా దొరకటం లేదు కానీ వొకటి మాత్రం స్పష్టం.
వారంతా కారణజన్ములు. ప్రభువుని కలవాలని వుంది కనుక దర్శనం లభించింది.
ఆ దర్శనంతో తరించి ఆధ్యాత్మికోన్నతి పొందారు.
దరిమిలా కాలంలో వారేమయ్యారు అంటారా, యిటువంటి వారెందరో కన్పిస్తారు
మెహెరీశంలో మనకి. అంతుచిక్కని ధర్మ ప్రయోజనార్థం కలుస్తారు వారు.
ముందుకి నడుస్తారు. డోరావాన్ గెల్డెర్ కుంట్జ్ సంగతి తీసుకోండి. వయస్సు 27.
అతీంద్రియశక్తుల పట్ల ఆసక్తి పెరిగింది. పైగా థియాసాఫిస్ట్. అందరిలాంటివాడు
కాదు కదా ఈ వ్యక్తి. బాబా వారతనికి ఏ ఆదేశం యిచ్చారో, ఏ ప్రకారంగా తమ
విశ్వకార్యక్రమంలో భాగస్వామిని చేశారో ఎలా తెలుస్తుంది. సర్వం తెలిసిన ప్రభువు
మౌనమూర్తి. అన్నీ తెలుసుకోవాలన్న తాపత్రయంలో వున్న జిజ్ఞాసువు పెదవి
విప్పదు. ఏమి చెప్పవచ్చో చెప్పకూడదో అన్న మీమాంస నోరు కట్టి పడేస్తుంది
కుంట్జ్ వంటివారిని. లూయిస్ స్కే అన్న వో చిన్నారి బాబా ఆశీస్సులు తీసుకొంది.
కెనడా దేశస్తురాలు. నాన్సీ ఫుల్ వుడ్ అన్న వో రచయిత్రి కూడా బాబావారిని
దర్శించింది. ఆత్మలని పిలిపించి మాట్లాడే ప్రక్రియలో అనుభవం వుంది అంటే
కొద్దో గొప్పో ఆధ్యాత్మిక మార్గానికి దగ్గరగా వుందన్నమాట.
అందుకనే మెహెరీశుని దర్శనం దొరికిందామెకి.

మరో నలుగురుకి కూడా దర్శనం లభించింది. వాళ్ళెవరు అంటే, వాళ్ళ పేర్లు - డొరోథి లూయిస్ నోర్రిన్, పెర్సిస్టీవార్ట్, హెన్రీ స్టీగ్నర్, నోర్మన్ వాకర్.
వీళ్ళ వృత్తి, ప్రవృత్తి గురించి చరిత్రకారుడు వ్రాయలేదు.
వాకర్ గారు యాభయ్యవ పడికి దగ్గర పడుతున్నాడు.
ఇంకో అయిదేళ్ళకి యాభయి వస్తాయి. పోషకాహార నిపుణుడు.
పౌష్టికాహారం ఎవరికి అక్కర్లేదు. అందరికీ కావాలి కదా.
మరి అందుకనే నోర్మాన్ వాకర్ గారు ఎప్పుడూ బిజీ బిజీనే.
హర్మాన్‌లో ఎందరో మహానుభావులు రచయితలు, కవులు, కళాకారులు, జిజ్ఞాసువులు వుండగా, యిదిగో ఈ అయిదారుగురికే మెహెరీశుని దర్శనం లభించింది. ఎందుకని అడగకండి.
అదొక పూర్వజన్మ సుకృతం.
భవిష్యవాణిలో వారి పాత్రకి అదొక సంకేతం అంతే.
నవంబరు 15వ తేదీ ఆదివారం నాడు బాబావారు న్యూయార్క్‌కి తిరిగి వచ్చారు. తమ తిరుగు ప్రయాణానికి అవసరమైన వీసా పాస్‌పోర్ట్‌ల పని పూర్తి చేశారు 17వ తేదీన.
హైదరాబాద్ నగరంలో అబిడ్స్ వంటిది న్యూయార్క్ నగరంలో మాన్హాటన్.
అబిడ్స్ కంటే వెయ్యి రెట్లు పెద్దది.
వాణిజ్య వ్యాపారాలకి పెట్టింది పేరు.
న్యూయార్క్ నగరాన్ని బిగ్ ఆపిల్ అంటారు.
దానికి ఆయువుపట్టు మాన్హాటన్.
ఇక్కడి స్టాక్‌ఎక్ఛేంజ్ ప్రపంచంలోనే అతిపెద్దది.
ఆ స్టాక్‌ఎక్ఛేంజ్ కేసి చూస్తూ బాబావారు ఏమన్నారో తెలుసా?
ఇది అంతా వో బుడగ అన్నారు.
ఎప్పుడు, ఏ సందర్భంలో ఆ వ్యాఖ్య చేశారో మరో సందర్భంలో.
ప్రస్తుతాంశం - ఉగ్రవాదుల దాడి.
2008వ సంవత్సరం సెప్టెంబరు నెల 11వ తేదీ సాయంత్రం మన్హాటన్, ఆ చుట్టుప్రక్కల ఉగ్రవాదులు భీభత్సం సృష్టించారు.
ప్రపంచ ప్రఖ్యాత వాణిజ్య కేంద్రం కుప్పకూలింది బాంబుల వర్షంలో.
మాన్హాటన్ ధ్వంసమయింది.
1930 దశకంలో మెహెరీశుడు మాన్హాటన్ సందర్శించడానికి, 2008 నాటి ఉగ్రవాదుల దాడికి సంబంధం వుంది అంటారు ప్రఖ్యాత విద్యావేత్త, కవి, ప్రొఫెసర్ రాథోడ్ గారు.

మెహెర్ నామం చెప్తూ ప్రభువులో లీనమయిన ధన్యజీవి ఆయన.
ఇంతకీ మెహెరుడు మాన్హాటన్‌లో ఏం చేశారు అంటే,
తిరుగు ప్రయాణానికి అవసరమైన వీసా, పాస్‌పోర్టు పని పూర్తిచేశారు.
న్యూయార్క్ సిటీ కాలేజీ పెద్ద ఫెడెరిక్ బి. రాబిన్‌సన్ గారింటికి వెళ్ళాళి.
కాన్వెంట్ ఎవెన్యూలో 28వ యిల్లు ఆయనిది.
ప్రభువు దర్శనానికి ఎందరో వచ్చారు.
చాలా మంది కొత్త వారే.
మెహెరుడు అందర్నీ ఆశీర్వదించాడు.
అక్కడి నుంచి గ్రోవ్ స్ట్రీట్‌లో 88వ యింటికి వెళ్ళారు మెహెరుడు.
ఆ యిల్లు ఎవరిది? ఫెల్స్ స్టోక్స్ దంపతులది.
వారి ఆతిధ్యాన్ని రెండు రోజులు స్వీకరించారు మెహెరుడు.
వేలంటైన్, డేవిడ్ షెర్రీ, మిలో షాటక్, గ్రెస్ మాన్,
జూలియనాన్ లావూర్, అనిత, ఆమె తల్లి జాక్విలిన్ ప్రభృతులు
బాబా వారిని దర్శించి తరించారు.
వేలంటైన్, షెర్రీలు మన కిట్టీ దేవి స్నేహితులు.
వాళ్ళిద్దరూ సంగీతకారులు "మావాళ్ళకి దర్శన భాగ్యం కల్గించమని",
కిట్టీ ఛాన్జీకి వ్రాసింది. ఆ విధంగా దొరికింది ప్రభు దర్శనం వారిద్దరికీ.
జాక్విలిన్ కొంచెం చాంధసురాలు. కొంచమేమి ఖర్మ. చాలానే.
ఏసుని మనసా వాచా నమ్మిన ఈమె,
కాథలిక్ మత పద్ధతుల్ని తూ.చ. తప్పకుండా ఆచరిస్తోంది.
ఆధ్యాత్మిక గురువులమంటూ వచ్చిన ప్రతివాళ్ళనీ పట్టించుకొనే వ్యక్తి కాదు.
కానీ కూతురు మాట కాదనలేక మెహెరు ప్రభువు సన్నిధికి వచ్చింది.
మనస్సు మారింది. ఈ మెహెర్‌బాబాలో ఏదో ప్రత్యేకత వుంది.
ఆయన సన్నిధిలో దివ్యానుభూతి పొందాను అని కూతురికి చెప్పింది దరిమిలా.
అప్పటి వరకూ చావు ముంచుకు వస్తోందన్న భయంపట్టి పీడించేదామెని.
ఆరోగ్యం కూడా అంతంత మాత్రమే.
బాబా వారిని దర్శించాక జాక్విలిన్ దృక్పథం మారింది.
ఈ మాటనే అనిత బాబావారి చెవిన వేసింది.
మా అమ్మ మదిలో వచ్చిన ఆధ్యాత్మిక చింతన అద్భుతం.
ఎప్పుడూ మీ నామస్మరణే.
మీ ఫోటో ఆమె దిండుపైనే ఎప్పుడూ.

ఎవరూ ముట్టుకోకూడదు, తీయకూడదు ఆ ఫోటోని, అని
అనిత వ్రాసింది బాబావారికి.
ప్రభువు చిరుదరహాసం చేశారు ఆ వుత్తరం చదివి వినిపిస్తుంటే.
ఫ్లారెన్స్ లీ నోరినా శిష్యులు.
ఎయిలీన్ బర్న్స్, బీయత్రీస్ గ్రెహామ్ కూడా ప్రభువు ఆశీస్సులు పొందారు
నవంబరు 17న. న్యూయార్క్‌లో మంచి పేరుంది లీకి.
ఆమె ఆధ్యాత్మిక విషయాలపై ధారళంగా ప్రసంగిస్తుంటుంది.
ఎయిలీన్‌కి 17 ఏళ్ళు కొంచెం సిగ్గు, మరి కొంచెం బిడియం.
ప్రభువుకి ఎదురుగా కూర్చొంది మౌనంగా. పెదవి కదిపితే వొట్టు.
అలా ప్రభువుకేసి చూస్తూంటే, కన్నీరు పెల్లుబికి వచ్చింది.
మెహెరుడు కన్నీరు తుడిచాడు. భుజం తట్టాడు.
బాబా వారి కళ్ళలోకి చూస్తూనే వుంది ఎలీస్.
'ఏం కనిపిస్తోందక్కడ,' అడిగారు మెహెరీశుడు.
అనంతజ్ఞానం అని తపీమని చెప్పింది.
**బాబా:** ఇప్పుడు నీకేమనిపిస్తోంది.
**ఏయిలీన్ బర్నెస్:** మాటల్లో చెప్పలేను బాబా!
మీతో ఇండియా రావాలనివుంది.
హిమాలయాల్లో సాధనా కేంద్రాలు వుంటాయట కదా.
విన్నాను. అటువంటి కేంద్రాలని కలలో చూశాను.
**బాబా:** నీ జీవితధ్యేయం?
**ఏయిలీన్:** కళలకి అంకితం చేయాలని వుంది.
నా జీవితాన్ని అందరిలా కాకుండా, భిన్నంగా వుంటూ కొత్తదనం,
కొత్తదనంలోనూ సహజత్వం రంగరించి
కళలకి ప్రాణప్రతిష్ఠ చేయాలని వుంది బాబా అన్నది.
**బాబా:** శభాష్ ! అలాగేచేయి.
నీ పేరు చెప్పి సంతోషంతో గెంతులు వేస్తారు నలుగురు.
దైవీ ప్రేరణ వుంటుంది నీ కళాసేవకి. అవును, నటన వచ్చా!
**ఏయిలీన్ :** నిరుడు స్టేజి ఎక్కాను బాబా.
బాగానే చేశాను. కానీ మళ్ళీ యిప్పట్లో నాటకం వేయను.
నటనలో పరిపూర్ణత వచ్చాకే స్టేజి ఎక్కుతా.
బాబా వారి ఆశీస్సులతో ఎయిలీన్ నాటకరంగంలో మంచి పేరు తెచ్చుకొంది.

అనేక రేడియో కార్యక్రమాల్లో పాల్గొనేది చురుకుగా.
వో మంచి కుర్రాడి కోసం మండలివారు ఎప్పుడూ
గాలిస్తూంటారని పాఠకులకి తెలుసు.
ప్రభువు విశ్వకార్యక్రమంలో పనికి వస్తాడు ఈ కుర్రాడు అంటూ
ఏ వూరు వెళ్ళినా, ఏ దేశం వెళ్ళినా
మంచి పిల్లాడి కోసం వెతుకుతూ వుంటారు.
బాబా వారు కూడా వాళ్ళని హుషారెత్తిస్తుంటారు ఈ విషయంలో.
కానీ, ఈ మధ్యకాలంలో ఈ అన్వేషణ ఫలించలేదు.
ఎడారిలో నీటి చుక్క దొరుకుతుందేమో కానీ,
జన సందోహంలో ప్రభువుకి నచ్చే, మెచ్చే పిల్లాడు దొరకలేదు యింతవరకు.
అమెరికాలో, అదీ న్యూయార్క్ నగరంలో మంచి పిల్లలకి కొరతా?
కాస్తంత వెతకండి అన్నారు మెహెరుడు.
మళ్ళీ అన్వేషణ ప్రారంభమైంది.
మాన్హాటన్‌లో బస చేస్తున్నప్పుడు వో పన్నెండేళ్ళ కుర్రాడు వచ్చాడు.
వాడంతట వాడుగా రాలేదు.
అతగాడి అమ్మ, నాన్న తీసుకువచ్చారు.
పేరు జిమ్మీ ఎస్ బార్‌స్టో. చూడటానికి బాగున్నాడు.
పభువుకి నచ్చాడు.
హమ్మయ్య? యింత కాలానికి మా అన్వేషణ ఫలించిందని
మండలివారు సంబర పడ్డారు.
జిమ్మీ మనతో వో రెండు వారాలు వుంటే బాగుంటుందన్నారు ప్రభువు.
అబ్బే ఏదో వొకటి రెండు రోజులు అయితే వుంచుతాము మీ దగ్గర.
రెండు వారాలంటే పిల్లాడి చదువు పోతుంది.
స్కూలుకి వెళ్ళవద్దా వాడు అన్నారు తల్లీ తండ్రి.
సరే, మీ యిష్టం అన్నారు మెహెరుడు.
జిమ్మీ కథపై తెర పడింది.
వాడు మరో రెండుసార్లు ప్రభువుని కలిశాడు.
హర్మాన్‌లో నవంబరు19న మెహెరుని దర్శించాడు.
బాబావారు న్యూయార్క్ నుంచి వాపసు బయలుదేరుతుంటే మళ్ళీ వచ్చాడు.
బహుశా ఆ చిన్నారికి మెహెరునితో వుండాలని వుందేమో పైకి చెప్పలేదు.
అదొక మూగ బాధ పసివానికి.

నవంబరు 17వ తేదీ ఉదయం,
మేరీ ఆంటిన్ వచ్చింది. ఆమె రచయిత్రి.
తన రచన, "వాగ్దానం చేసిన భూమి"ని ప్రభువుకి సమర్పించింది.
ఇదొక రష్యన్ కాందిశీకుడి కథ.
పొట్ట అరచేతిలో పెట్టుకొని అమెరికా వచ్చిన వ్యక్తి ఆ రష్యన్.
క్రైస్తవ కథల్లో "వాగ్దానం చేసిన భూమి" అనే ప్రస్తావన వస్తూంటుంది.
వాగ్దానం, అదే మాట యిచ్చిన భూమి, అంటే స్వర్గం అని చెప్పుకోవాలి.
మనిషి కోర్కె భగవంతునితో ఏకమై స్వర్గవాసుడు కావాలనే కదా!
సరే, యింతకీ మేరీ అంటిన్ కోరిక కూడ స్వర్గవాసిని కావాలనేనా!
బాబావారిని స్వర్గం గురించి అడగలేదు.
మోక్షం కావాలనీ ప్రార్థించలేదు.
మీ సేవలో కృతార్థురాలిని కావాలని వుంది ప్రభూ అంది.
మీ కోసం, మీ సందేశవ్యాప్తి కోసం కలం పట్టాను అంది.
నాకో చిన్ని అవకాశం యిప్పించండి దేవ దేవా అని వేడుకొంది.
మెహెరుడు చిరునవ్వు నవ్వాడు.
(మనో వాంఛ సిద్ధిరస్తు అన్నారు).
ఆనందంతో గెంతులు వేసింది మేరీ మనస్సు.
తన ఆనందానికి హద్దులు లేవు ఆవేళ.
ఆ మాటే వ్రాసింది ఎలైస్ గ్రీన్‌కి, నవంబరు 24న.
చర్చికి వెళ్ళామనుకో.
అక్కడ ఎవరూ లేరనుకో,
ఎంత ప్రశాంతంగా వుంటుందో తెలుసుగా.
అంతకు మించిన శాంతి, ప్రశాంతి మెహెరుని సన్నిధిలో లభించాయి అని వ్రాసింది.
మనసులో మాట చెప్పగానే మెహెర్ ప్రభువు నగుమోము
నా హృదయ ఫలకంపై చెరగని ముద్ర పడింది.
నమ్ము, నమ్మకపో అన్నది.
అక్క, తమ్ముడు, అన్నా, చెల్లి ఈ సంబంధాలే తెలుసు మనకి.
మెహెరుని సన్నిధిలో ఈ భవబంధాలకి అతీతమైన
బాంధవ్యం ఏర్పడుతుంది. ఇది నా స్వీయానుభవం.
అందుకనే నీకు వ్రాస్తున్నాను అని తన లేఖని ముగించింది మేరి.

**-సశేషం**

# నిజామాబాద్‌లో మూడ్రోజుల ప్రేమిక సహవాస్

**2022 డిసెంబరు 9 - 11 వరకూ**

అవతార్ మెహెర్‌బాబా నిజామాబాద్ కేంద్ర భవనం నిర్మించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని 2022 డిసెంబరు 9 సాయంత్రం 6 నుండి డిసెంబరు 11వ తేది సాయంత్రం వరకూ ప్రత్యేక ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు శ్రీ ఎ.జనార్ధనరావు **(99087 85774)** ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధికసంఖ్యలో పాల్గొనవల్సిందిగా ఆయన కోరుతున్నారు.

# ఆంధ్రా రెస్ట్ హౌస్

2022 జూలై 10, అవతారుని మౌన వార్షికోత్సవం సందర్భంగా మెహెరాబాద్‌కి విచ్చేస్తున్న బాబా ప్రేమికులు ఆంధ్రా రెస్ట్ హౌసులో భోజన, వసతి కోరుకునే వారు తమ వివరాలను 2022 జూన్ 10లోగా తెలియజేయవల్సిందిగా శ్రీ శ్రీనివాస్ **(99121 99978)** ఒక ప్రకటనలో కోరారు.

# బాబా కేంద్రాలు

తెలుగు రాష్ట్రాలలో చురుకుగా బాబా కార్యక్రమాలు నిర్వహిస్తున్న 116 బాబా కేంద్రాల అధ్యక్షులు, కార్యదర్శుల పేర్లు, వారి మొబైల్ నంబర్లుతో కూడిన వివరాలను 2022 మే 30లోగా మెహెర్‌బాబా మాస పత్రిక వాట్సప్ గ్రూప్ 9959553218లో పొందుపరచనున్నాం. దయచేసి పరిశీలించగలరు.

# భాగవతోత్తములు

బాబా ప్రేమికులు తమ అనుభవాలు - అనుభూతులను పలువురితో పాలుపంచుకోవడం ద్వారా బాబావారి నామవ్యాప్తి ఇతోధికంగా జరుగుతుంది. ఇది బాబాకెంతో ఇష్టం. అందుకే, ఆ దేవదేవునితో నాకు గల అనుభవాలను వీలుచిక్కినప్పుడల్లా బాబా ప్రేమికులతో ఉన్నది ఉన్నట్లు చెప్తున్నానని బాబా స్త్రీ మండలి సభ్యురాలు - కేటి ఇరాని, మెహెరాజాద్ ఒక సందర్భంలో పేర్కొన్నారు. **ఇలాంటివారందర్నీ భాగవతోత్తములు అనొచ్చు. ఈ తరం యువతకు వీరు ఆదర్శం కావాలి!!**

# మెహెర్‌బాబాతో శ్రీ నీలం సంజీవరెడ్డి

తెలుగువారందరికి బాగా పరిచయమున్న వ్యక్తి, డాక్టర్ నీలం సంజీవరెడ్డి. భారత రాష్ట్రపతిగా మన దేశానికి ఆయన ఎనలేని సేవలందించారు. ఒక సందర్భంలో పూణేలోని గురుప్రసాద్‌లో బాబావారి దర్శన కార్యక్రమంలో శ్రీ నీలం సంజీవరెడ్డి పాల్గొన్నారు. అప్పట్లో ఆయన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. శ్రీ నీలం బాబాను దర్శించుకున్న పిదప బాబా ఆయన్ని ఉద్దేశించి ఒక చక్కని సందేశాన్ని ఇచ్చారు. ఆ సందేశ సారాంశం ఇలా వుంది.

**"భగవంతుని ఆదేశాలు పాటించనివారు, ఆయనపట్ల విధేయత చూపనివాళ్ళకంటే, భగవంతుడనేవాడు లేడని వాదించే నాస్తికులు ఎంచుకున్న మార్గం మేలన్నారు బాబా.**

చాలా సందర్భాలలో మీ బలహీనతలను కప్పిపుచ్చుకునేలా ప్రవర్తిస్తూ,
ఆ బలహీనతలే మీ గొప్పతనంగా భావిస్తుంటారు.
తాము భగవత్ ప్రేమికులమని అంటూ, వ్యక్తిగతంగా,
సమాజపరంగా కూడా నిజాయితీగా ప్రవర్తించకపోవడం
గొప్ప కపటం, (హిపోక్రసీ) అని బాబా అన్నారు.
మీకు తరచు వచ్చే కష్టనష్టాలు అవి మీ శక్తిసామర్థ్యాలను నిరూపించుకోవడానికి
ఓ అవకాశం కల్పించినట్లని అన్నారు బాబా.
ఓ చంటి బిడ్డడు తన తల్లిని సంపూర్ణంగా నమ్ముతాడు.
తన కష్టాలన్నీ తల్లికే అప్పజెబుతాడు.
ఆ చంటివాని బాగోగులన్నింటినీ కూడా, ఆ తల్లి చాలా జాగ్రత్తగా చూసుకుంటుంది.
పాలు తాగే పసిపిల్లవాడు తల్లిని ఏమాదిరిగా నమ్ముకుంటాడో, ఆ మాదిరిగా
మీరు కూడా దేవునిపట్ల సంపూర్ణ నమ్మకంతో వుండండి.
మీ సమస్యలు, కష్టనష్టాలు అన్నీ ఆయనకే అప్పజెప్పితే,
దేముడే మిమ్మల్ని అన్నివేళలా చల్లగా చూసుకుంటాడన్నారు బాబా.

***

దేశ నాయకుడు భగవంతుని ఎడల పూర్తి విశ్వాసంతో వుంటే,
దేశ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం సరైన నిర్ణయాలు తీసుకోవడంలో
భగవంతుడు అన్నివేళలా ఆతనికి సహాయపడతాడని
బాబా శ్రీ నీలంకు సూచించారు. మీ గురించి చెడుగా ఆలోచించే వారి గురించి కూడా మంచి జరగాలనే ఆశించండని బాబా శ్రీ నీలంను హెచ్చరించారు.

*** లార్డ్ మెహెర్ యుయస్ఏ ఎడిషన్ పేజి. 5767**

# నాయకుడు-సేవకుడు

**శ్రీ కుప్పిలి సత్యనారాయణ, విశాఖపట్నం** శ్రీ నీలం గారి **విషయమై ఇంకా ఇలా తెలియజేస్తున్నారు.** ఒక సందర్భంలో విశాఖ సత్సంగ్‌లో మాట్లాడుతూ శ్రీ జియస్ఎన్ మూర్తి చెప్పిన మాటలు ఇలా వున్నాయి. శ్రీ నీలం గారి విషయంలో సందర్భోచితంగా పాఠకులకు తెలియజేద్దామనుకుంటున్నాను. శ్రీ జియస్‌యన్ గొప్ప భాగవతోత్తముడు. నిత్య భగవత్‌గీతా పారాయణం చేసినవాడు. గీతపై అనర్గళంగా అనేక సభలలో ప్రసంగిన అనుభవం ఆయన సొంతం. శ్రీ నీలం సంజీవరెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్న పలు సభలలో కూడా శ్రీ జియస్ఎన్ ప్రసంగించారు. ఆ దరిమిలా, శ్రీ జియస్‌యన్ - శ్రీ నీలంల నడుమ ఈ పరిచయాలు గొప్ప స్నేహంగా మారాయి. బాబా ప్రేమికుడైన శ్రీ జియస్ఎన్‌ని తనకు బాబా దర్శనం ఏర్పాటు చేయవల్సిందిగా చాలాకాలంగా శ్రీ నీలం అడుగుతున్నాడు. శ్రీ జియస్ఎన్ తగిన సమయం కోసం వేచి చూస్తున్నాడు. కాగా, ఆ రోజు రానేవచ్చింది. ఆ రోజుల్లో కాంగ్రెస్ మహా సభలు పూణేలో జరుగుతున్నాయి. ఆ పార్టీ అధ్యక్ష హెూదాలో శ్రీ నీలం పూణేలో వున్నారు. అదే సమయంలో గురుప్రసాద్, పూణేలో బాబా దర్శనం ఇస్తున్నారు. శ్రీ జియస్‌యన్ బాబా సమక్షంలోనే వున్నారు. ఇదంతా యాధృచ్ఛికమా? కాదేమో? ఏదిఏమైతేనేమి, శ్రీ నీలం అభ్యర్ధనను బాబాకు తెలియజేశాడు శ్రీ జియస్‌యన్. బాబా వెంటనే అంగీకరించారు. దాంతో, శ్రీ జియస్‌యన్ శ్రీ నీలంని తీసుకురావడం కోసం బయల్దేరుతుంటే, అక్కడికి ఎలా వెళ్తున్నావ్? అని బాబా అడిగారు. టాక్సీలో వెడతాను బాబా అని జవాబిచ్చాడు. అలాకాదు, తన కారుని తీసుకెళ్ళమని బాబా ఆదేశించారు. అలా కారు గారేజి కేసి వెళ్తూ, శ్రీ నీలం ఎంత అదృష్టవంతుడో కదా!! దర్శన భాగ్యం మాత్రమే కాదు. బాబా తన కారు కూడా ఆతనికిచ్చారని మనస్సులో అనుకోవడమే తరువాయి, జియస్ఎన్‌ని వెనక్కి పిలిపించారు. ఆ కారు నీకోసం మాత్రమే. శ్రీ నీలం ఆతని కారులోనే రావాలన్నారు. శ్రీ నీలం దర్శనం కార్యక్రమం ముగిశాక, కారు దగ్గరకు వెళితే డ్రైవర్ అక్కడ లేడు. పదిపదిహేను నిముషాలు ఆయన కారు డ్రైవరు కోసం వేచివుండాల్సివచ్చింది. ఇలా ఎందుకు జరిగిందంటే పాఠక మహాశయా!! బాబా దర్శన కార్యక్రమం జరుగుతున్నంత సేపు ఆ డ్రైవర్ అక్కడున్న కిటికీ లోంచి లోనికి తొంగి-తొంగి చూస్తుండం గమనించిన అవతారుడు ఆతడ్ని కూడా లోనికి పిలిపించారు. "శ్రీ నీలం డ్రైవర్‌కి కూడా బాబా దర్శనం భాగ్యం కల్పించారు. కొద్ది క్షణాలు వేచి వుండమని బాబా శ్రీ నీలంకి మండలివారిచేత కబురు పంపారు. బాబాకు నాయకుడు- సేవకుడనే బేధం లేదు సుమీ అనుకున్నారట శ్రీ జియస్‌యన్. బాబా సాక్షాత్తూ అవతారుడు. అందరివాడూనూ అని జియస్‌యన్ చెప్పడం ముగించారు.

***

# కామారెడ్డి కేంద్ర 28వ వార్షికోత్సవం

కామారెడ్డి బాబా కేంద్ర 28వ వార్షికోత్సవం 2022 మే 1వ తేదీన వేడుకగా జరుపుకుంటున్నట్లు ఆహ్వానం పంపారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక సహవాస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# సారధి కేంద్ర 4వ వార్షికోత్సవం

శ్రీకాకుళం జిల్లాలోని రాజాంకు దగ్గర్లో వున్న సారధి బాబా కేంద్ర 4వ వార్షికోత్సవం 2022 మే 5వ తేదీన వేడుకగా జరుపుకుంటున్నట్లు ఆహ్వానం పంపారు. ఉదయం 7 నుండి మధ్యాహ్నం 1.30 వరకూ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యేక సహవాస్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రా సెంటర్ ఉపాధ్యక్షులు శ్రీ సివై చింతామణి ప్రత్యేక ఆహ్వానితులుగా, శ్రీ మెహెర్ నారాయణ, చి. సిరి చందన బాబా సందేశాలపై ప్రసంగించనున్నారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు.

# కరీంనగర్‌లో ప్రత్యేక సహవాస్

కరీంనగర్ కేంద్ర బాబా ప్రేమికులు శ్రీ శివ రవీందర్ గారి జ్ఞాపకార్థం ప్రత్యేక బాబా సహవాస్ కార్యక్రమం 2022 ఏప్రిల్ 26న ఏర్పాటుచేసినట్లు స్థానిక బాబా ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ శివ రవీందర్ అవతారుని కార్యక్రమాలలో చాలా చురుకుగా పాల్గొనేవాడు. అవతారుని నామస్మరణ క్షణం విడువక చేస్తుండేవాడు. 2021 ఏప్రిల్‌లో కరోనా మహమ్మారి వల్ల బాబా నామస్మరణతో తుదిశ్వాస వదిలాడని, అవతారునిలో ఐక్యమైన ధన్యుడు శ్రీ రవీందర్ అని బాబా ప్రేమికులు ఆయన సేవలను కొనియాడారు. ఈ సహవాస్ కార్యక్రమం స్థానిక భగత్‌నగర్‌లో వున్న వారి స్వగృహంలో ఘనంగా జరిగింది.

# చల్లపల్లి బాబా కేంద్రంలో

చల్లపల్లి బాబా కేంద్రంలో 2022 ఏప్రిల్ నెలలో ప్రతి ఆదివారం బాబా సత్సంగ్ కార్యక్రమాలు వేడుకగా జరుపుకున్నామని కార్యదర్శి శ్రీ పివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఏప్రిల్ 3న కొవ్వూరులో జరిగిన ప్రేమిక సహవాస్‌కి, ఆ పిదప ఏప్రిల్ 24న బందరు బాబా ప్రేమిక సహవాస్‌లకు చల్లపల్లి కేంద్రం నుండి బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు.

# తూర్పు-పశ్చిమ దేశాల సమావేశం

## (ఈస్ట్-వెస్ట్ గాదరింగ్)

## 1962 నవంబరు 1 నుండి 5 వరకూ గురుప్రసాద్, పూణే

**(గత సంచిక తరువాయి)**

**ది ఎవ్రీథింగ్ అండ్ ది నథింగ్** అనే పుస్తకం ప్రింటింగ్ కోసం ఆస్ట్రేలియాకు చెందిన డెనిస్ ఓ'బ్రియన్, బిల్ లి పేజ్‌లకు బాబా ఇచ్చారు. ఓ'బ్రియన్, లీ పేజ్ సహాయంతో ఆ పుస్తకాన్ని ముద్రించారు. బిల్ లీ పేజ్ తన కుటుంబ సభ్యులందరితో కలిసి ఈ సమావేశాలకు వచ్చాడు. ఆ పుస్తకం గురించి ప్రస్తావిస్తూ, బాబా ప్రేమికురాలు అనిత వియిలార్డ్‌ని ఆటపట్టించారు బాబా. “మీరు చదవరు. మీకు భగవంతుని గురించి ఏమీ తెలియదనుకోండి! కనీసం నేను ఏం చెప్పానో అది చదవండి” అని అన్నారు. పాశ్చాత్య ప్రేమికుల తరఫున కిట్టి దేవి, డేలియా అనే ప్రేమికులు **స్పార్క్స్ ఫ్రం మెహెర్‌బాబా** అనే బాబా సందేశాలతో కూడిన 1000 పుస్తకాలను బహుకరించారని బాబా చెప్పారు. ఈ పుస్తకాలను డేలియా సంకలనం చేసింది. ఈ పుస్తక సంకలనంలో డేలియాని కిట్టీ ఎంతగానో ప్రోత్సహించింది. అలాగే, బ్రిటీషు, అమెరికన్ ప్రేమికులు ఇద్దరూ ఈ పుస్తక ప్రచురణకయిన ఖర్చును చెరిసమానం భరించారు. ఈ పుస్తకాలను ఈ సమావేశాలలో విక్రయించే ఏర్పాట్లు చేశారు. బాబా ప్రేమికుడైన పర్థమ్ ఈ పుస్తక ముద్రణలో సహాయపడటమే కాకుండా, పుస్తకం గురించి తన అభిప్రాయంగా ముందుమాట కూడా రాశాడు. ఈ బహుమతితో తాను ఎంతో సంతోషిస్తున్నానని బాబా అన్నారు. ఆ పిదప బాబా ఇలా అన్నారు. జీవిత లక్ష్యం ఏమిటి? భగవంతుని దర్శించుకోవడం, ఆ పిదప భగవంతునిలో ఐక్యం కావాలి. భగవంతుడనేవాడు వుంటే, ఆయన్ని మనం తప్పక చూడాలి! అదే మానవ జీవిత ఏకైక లక్ష్యం. ఐతే ఇది ఎలా సాధ్యమౌతుంది. భగవంతుని దర్శనానికి అనేక మార్గాలు ఉన్నాయి. కొందరు ధ్యానం ద్వారా భగవంతుడిని దర్శించే ప్రయత్నం చేస్తారు. ధ్యానంలో ఎంతో ఏకాగ్రత పాటిస్తారు. ఇది చాలా సుదీర్ఘమైన ప్రక్రియ. ఐతే, భగవంతునికి – ప్రేమికునికి నడుమ వున్న అడ్డుతెర తొలగిపోయి, నీలోనే వున్న ఆ దేవదేవుని దర్శనానికి ఈ ధ్యానం ఏమాత్రం సహాయపడదు అని బాబా స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎందరో యోగులున్నారు. వీరు పలు మార్గాల ద్వారా అనంత ఆనందానుభూతి పొందాలని ప్రయత్నిస్తారు. ఐతే, క్రమంగా వారిలో చాలామంది

మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు తీసుకోవడానికి అలవాటుపడి దానికి బానిస అవుతారు. మత్తుమందుల ప్రభావం వల్ల వారు కొద్ది క్షణాలు అనంత ఆనందంలో వున్నామన్న అనుభూతి చెందినా, ఆ అనుభూతి శాశ్వతం కాదు. అది కేవలం భ్రాంతిమయం. వారు తీసుకున్న మత్తు ప్రభావం క్రమేణా తగ్గిపోతుంది అన్నారు బాబా. అలాగే, కొంతమంది యోగులు వివిధ మార్గాల ద్వారా భగవంతుని దర్శనం కోసం ప్రయత్నిస్తారు. ఈ ప్రయత్నంలో వారెన్నో అనుభవాలను పొందుతారు. ఐతే, ఈ అనుభవాలు – అనుభూతులన్నీ అశాశ్వతం, అనేక విధాల భ్రాంతిమయం అని ప్రకటించారు మెహెర్‌బాబా. కొంతమంది స్వాములు తాము అనుభవించిన అనుభూతిని గొప్పగా చిత్రీకరిస్తూ, తాము దేవుని దర్శనం పొందామని తమ అనుభూతుల్ని పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటారు. ఐతే వారు అనుభవించింది కేవలం భ్రాంతి. నిజమైనది, శాశ్వతమైన సత్యం కాదు. ఐనప్పటికీ, ఇటువంటి నకిలీ స్వాముల చుట్టూతా అమాయక ప్రజలు కొందరు ఆ స్వామివారు పొందిన అనుభూతిని ఆస్వాదించడానికన్నట్లు వారి చూట్టూతా చేరతారు. ఈ అనుచరుల బృందానికి కూడా మత్తుమందు అలవాటు చేసి, ఆ మత్తులో, ఆ భ్రాంతిలోనే భగవంతుని దర్శన అనుభూతి లభిస్తోందని భ్రమపడేలా చేస్తున్నారు కొందరు నకిలీ స్వాములని, వారి బారిన పడవద్దని బాబా హెచ్చరించారు. ఇది ప్రజలను మోసం చేయడమేనని బాబా అన్నారు. పది లక్షలమందిలో ఏ ఒక్కరో ఏకాగ్రత, దీక్ష వల్ల తనలో వున్న భగవంతుని దర్శన భాగ్యం పొందగలుగుతారు. అలా భగవంతుడ్ని దర్శించుకున్న వానికి తన చుట్టుప్రక్కల ఏం జరుగుతోందో అతనికేమీ పట్టదు. ఆ అనంత ఆనందంలో ఆతడు తేలియాడుతుంటాడు. అలాగే ఒక నిజమైన యోగికి, దేవుని దర్శన భాగ్యంతో అనంత ఆనందడోలికల్లో వున్న వ్యక్తికి కూడా భగవదైక్య సాధన కోసం, సద్గురువు సహాయం తప్పనిసరి అని బాబా స్పష్టం చేశారు. ఈ విషయాలు చాలా సంక్లిష్టమైనవి. ఈ కష్టమైన విషయాలను ఈ అంశాలపై రాసిన గ్రంధాలు మరింత సంక్లిష్టం చేశాయన్నారు బాబా. ఎన్ని గ్రంధాలు చదివినా, భగవంతుడ్ని ఎంత అర్థం చేసుకున్నా, అది భగవసాక్షాత్కారానికి దారి తీయదు. మానవ జీవిత లక్ష్యమైన బ్రహ్మైక్య సాధనకు, భగవంతునిలో ఐక్యం సాధించడానికి, సద్గురు కృప తప్పనిసరని బాబా మరోమారు స్పష్టం చేసారు. ఆ సమావేశంలో బాబాకు దగ్గరగా వున్న అనిత అనే ప్రేమికురాలితో, "నీకు భగవంతునిలో ఐక్యం కావాలని వుందా?" అని బాబా ప్రశ్నించారు. నాకు కేవలం నిన్ను చూస్తూవుండాలని వుంది బాబా అని ఆ ప్రేమికురాలు జవాబిచ్చింది. బాబా చిరునవ్వులు చిందిస్తూ ఏకకాలంలో రెండు విషయాలు ఎలా సాధిస్తావ్ అని బాబా తిరిగి ఆమెతో ఇలా అన్నారు. ఇక్కడ నన్ను చూస్తూ, అదే సమయంలో

నా నిజరూప దర్శనం, రెండూ ఎలా సాధ్యం ? అని ప్రశ్నించారామెని. ఒక చిన్న విషయాన్ని ఎంత క్లిష్టంగా చెప్పారో కదా అన్నారు బాబా. నేనొక సూచన ఇస్తున్నానన్నారు. భగవదైక్య సాధనకు ఒక చక్కని సుళువైన మార్గం నేను చెప్తానంటూ బాబా ఏమన్నారంటే, అన్నీ వదిలి నన్ను ప్రేమతో అనుసరించండి. నన్ను ప్రేమించండి అన్నారు. అలా అంటే మీ సంసారం, పిల్లలు, కుటుంబం, ఇల్లు వాకిలి అన్నీ వదిలిపెట్టి నా దగ్గరకు రమ్మనమని కాదు అన్నారు నవ్వుతూ. అది నా ఉద్దేశ్యం కాదన్నారు! అలా ఎన్నటికీ చేయొద్దని అన్నారు. బాబా ఈ మాటలు అంటూంటే, సహవాసీలందరూ బిగ్గరగా కడుపుబ్బ నవ్వారు. మీ కుటుంబంతో, మీ ఇంట్లోనే హాయిగా సుఖంగా వుంటూనన్ను ప్రేమించవల్సిన రీతిలో ప్రేమించమని అన్నారు. అన్నింటికంటే మిన్నగా, నన్ను ప్రేమించడం, సుళువైన విషయాలన్నింటి కంటే కూడా ఎంతో సుళువైనదన్నారు. మీరు ప్రయత్నించండి. మీరు ప్రయత్నిస్తే, నేను తప్పక సహాయం చేస్తానని బాబా హామీ ఇచ్చారు. ప్రేమ వల్లనే మీరందరూ ఈ రోజు నా దగ్గరకు వచ్చారు. నేను మిమ్ముల్ని ప్రేమించకపోతే మీరిక్కడకు వచ్చివుండేవారు కాదు. నా ప్రేమవల్లనే మీరు నావైపు ఆకర్షించబడ్డారు. అదే సమయంలో బాబా మరోమాట అన్నారు. మీ ఎడల నాకు వున్న ప్రేమవల్లనే మీరిక్కడకు రాగల్గారు. **“మీ ఎడల నాకున్న ప్రేమ వల్ల మీరు రాగల్గారు కానీ, మీకు నా ఎడల వున్న ప్రేమ వల్ల కాదని బాబా సుస్పష్టం చేసారు.** నా చిరకాల ప్రేమికురాలు మార్గరెట్ క్రాస్కీ తనతో మరో ఇద్దరు ప్రేమికుల్ని నా దగ్గరకు తీసుకొచ్చిందన్నారు బాబా.ఆ పిదప, మండలి సభ్యుడైన ఏరుచ్ బాబా సందేశాన్ని చదివి వినిపించాడు. జననం – మరణం అనేది లేనేలేదన్నారు. ఎవరూ చనిపోరు. మరెవరూ పుట్టరు. ఐతే, అదృష్టవంతుడైన వ్యక్తికి నిజమైన మరణం ఒక్కసారే సంభవిస్తుంది. ఆ అరుదైన విశిష్ట వ్యక్తి తాను మరణించి, తిరిగి భగవంతునిలో జన్మిస్తాడని బాబా సందేశంలో పేర్కొన్నారు. ఇదంతా రాత్రిళ్ళు నిద్రకు ఉపక్రమించడం, తెల్లవారాక నిద్ర లేచినట్లేనని బాబా అన్నారు. ఒకసారి మరణించి, మరో జన్మఎత్తడం, మరొక రూపాన్ని తీసుకోవడమంటే, తెల్లవారాక నిద్ర లేచినట్లు అన్నారు. ఇలా పునరపి మరణం, పునరపి జననంతో, నిజమైన మరణం సంభవించి, తిరిగి నాలో జన్మించే వరకూ ఈ ప్రక్రియ కొనసాగుతుందని బాబా స్పష్టం చేశారు. న్యూయార్క్ నుంచి వచ్చిన బాబా ప్రేమికుడు డాక్టర్ హారికెన్‌మోర్ కేసి బాబా చూస్తూ, ఈ విషయంలో నీవేమైనా చెప్తావా? అని అడిగారు. ఈ మరణం, భగవంతునిలో జననం, **“జీవితం యొక్క అత్యున్నత ప్రయోజనంని సూచిస్తుందని** డాక్టర్ హారీ అన్నాడు. బాబా ఇంకా ఇలా అన్నారు. కొందరు అదేపనిగా ఇతరుల్ని ద్వేషిస్తారు. ఇతరుల్ని చూసి అసూయపడుతుంటారు. తమ కుటిల సంభాషణా

చాతుర్యంతో ఎదుటివారి మనస్సులు నొప్పించేలా ప్రవర్తిస్తుంటారు. మరికొందరు ఇతరుల్ని సంతోషపెట్టే ప్రయత్నంలో వుంటారు. అందరితో ప్రేమగా మసులుతారు. ఇదిఇలావుంటే, భగవంతునితో ఐక్యమైన వ్యక్తి అందరితో, మంచివారితో అలాగే దుర్మార్గులను సమానంగా ఆదరిస్తాడు. ఆతను అందరికి చెందినవాడు. ఏసుక్రీస్తు ఇతరుల కోసం జీవించాడు. భగవంతునితో ఐక్యం కావాలని కోరుకునేవారు దేనిని త్యజించాల్సిన పనిలేదు. వారు తమ ఆస్తి, కుటుంబం ఇతరత్రా ఏమీ వదిలిపెట్టవల్సిన పనిలేదు. ఐతే, "నేను" అనే అహంభావాన్ని త్యజించిననాడు, భగవదైక్యం సాధించగల్గుతారని బాబా అన్నారు."అహం","నేను", ఎలా త్యజించగల్గుతారని బాబా ప్రశ్నిస్తూ, సహవాసీలకు ఇలా వివరించారు. అనితా!! నీవు నేను అనే భావం నుండి బైటపడగలవా? అని ప్రశ్నించారు. తన చిన్నతనంలో జరిగిన సంఘటన గురించి చెప్తానని బాబా ఇలా అన్నారు. ఆధ్యాత్మిక చింతనాపరులైన నలుగురు ఇరానీలకు సంబంధించినదీ కథనం. ఆధ్యాత్మిక ప్రగతికి నేను అనే భావాన్ని తొలగించుకోవాలనే విషయాన్ని వారు ఆధ్యాత్మిక గ్రంధాల ద్వారా తెలుసుకున్నారు. ఆ దరిమిలా, "నేను" అనే భావం పోగొట్టుకోవడానికి మత్తు ఎక్కించే సురాపానం అత్యుత్తమమనుకున్నారు. మద్యం తీసుకున్నాక వారికి అద్భుత అనుభూతి సొంతమైంది. వారుంటున్న బసకు దగ్గరలోనే ఒక ఎద్దుల బండి ఉంది. ఆ నలుగురూ ఆ ఎద్దులబండిని తమ బలమంతా వుపయోగించి ఆ రాత్రంతా బలవంతంగా లాగి తెల్లారేసరికి బాగా అలసిపోయారు. ఆ పిదప, వారి శరీర స్పృహ కూడా కోల్పోయారు. ఈ విధంగా తమ భౌతిక స్వభావాన్ని త్యజించటానికి వారు ప్రయత్నించారు. నేను అనే అహంకార భావాన్ని తొలగించుకొని ఆధ్యాత్మికంగా మరింత పురోగమించడానికి వారు చేసిన ప్రయత్నం ఇది. ఇదంతా వారికి పుస్తక జ్ఞానం వల్ల సంక్రమించింది కాని, సద్గురువు సహాయం వారికి ఏమాత్రం లేదని బాబా అన్నారు. "నేను అనే భావాన్ని నీవెలా త్యజిస్తావ్, అనితా?" అని బాబా అడిగారు. "సద్గురువుకి విధేయత చూపడం ద్వారా" అని అనిత జవాబిచ్చింది. ఒకసారి నీవు సద్గురువుకి విధేయతగా కట్టుబడి ఉండాలని నిర్ణయించుకుంటే, ఆపై నీపై నీకు ఎలాంటి స్వేచ్ఛ వుండదు. ఐతే, నీలో లేశమాత్రం హిపోక్రసీ, కపటం వుంటే మాత్రం, మీ లక్ష్యం నెరవేరదు సరికదా, అదొక పెద్ద ప్రహసనమౌతుందని బాబా హెచ్చరించారు. మీరు సద్గురువు పట్ల విధేయతతో నిజాయితీగా వుండాలి. ఇది మాటల్లో చెప్పినంత సులభం కాదు. కొన్ని లక్షలమందిలో ఎవరో ఒకరు మాత్రమే తమ లక్ష్యాన్ని సాధించగల్గుతారని బాబా అన్నారు.

**-సశేషం**

# కొత్త పుస్తకం–త్వరలో




మహిళా ప్రేమికుల కోసం ప్రత్యేక సహవాస్ కార్యక్రమాన్ని 1958 ఫిబ్రవరి 14 నుండి 26 వరకూ రెండు వారాలు మెహెరాబాద్‌లో నిర్వహించారు. **ముందుగా 1958 ఫిబ్రవరి 14 నుండి 19 వరకూ హింది, మరాఠి ప్రాంతీయులకు, తిరిగి ఫిబ్రవరి 21 నుండి 26 వరకు తెలుగు, గుజరాతీ ప్రాంతీయులకు** సహవాస్ కార్యక్రమాన్ని బాబా స్వయంగా మెహెరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ఈ సహవాస్‌లో సుమారుగా 750 మంది బాబా ప్రేమికులు పాల్గొన్నారు.

ఈ అవతారకాలంలో బాబా నిర్వహించిన సహవాస్‌లలో ఇది చిట్టచివరిదని బాబా ప్రకటించారు.

ఎన్నో సందేశాలు ఈ తరం వారి కోసం ఆనాటి సహవాస్‌లో అవతారుడు అందజేశారు. ఈ కార్యక్రమం ప్రత్యేకంగా స్త్రీల కోసం ఏర్పాటు చేసినా పురుషులను కూడా బాబా అనుమతించారు. ఆ రోజుల్లో బాబా ఆరోగ్యం అంతంత మాత్రంగా వుండింది. 1956 డిసెంబరు 2న అవతారునికి సతారాలో జరిగిన కారు ప్రమాదం, అంతక్రితం అమెరికాలో ఓక్లహోమా దగ్గర జరిగిన కారు ప్రమాదాల గురించి పాఠకులకు విదితమే. ఈ ప్రమాదాల వల్ల బాబా శరీరంలోని కుడి, ఎడమ పార్శ్వాలు రెండువైపులా బాగా దెబ్బతిన్నాయి. భౌతికంగా అనేక బాధలు అనుభవిస్తున్న సమయమది. ప్రతిరోజూ జ్వరంతో బాధపడుతున్నారు. బాబా ఆరోగ్యం బాగా లేకపోయినా సహవాస్ కార్యక్రమం కోసం బాబా ప్రతిరోజూ మెహెరాజాద్ నుండి మెహెరాబాద్‌కు వచ్చారు. అలాంటి పరిస్థితులలో విచ్చేసే ప్రేమికులకు దర్శన, ఆలింగనంలతోపాటు సహవాస్‌లో ఏకధాటిగా కొన్ని గంటలసేపు కూర్చుని సహవాసీలతో ముచ్చటించడం, వారికి ప్రవచనములు అందజేయడమంటే, క్రీస్తుకు వేసిన శిలువతో సమానమని బాబా పేర్కొన్నారు. విచ్చేసిన వందలాది సహవాసీల సంస్కారాల భారాన్ని కూడా

బాబా స్వీకరించవలసి వుంది. మానవాళిపై, ముఖ్యంగా ఆయన ప్రేమికుల ఎడల గల ప్రేమ, దయ వల్ల బాబా ఈ సహవాస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని చెప్పాలి. ఈ సహవాస్‌లో తెలుగు బాబా ప్రేమికులకు 1958 ఫిబ్రవరి 25న అవతారుని 64వ జన్మదిన వేడుకలలో పాల్గొనే అరుదైన అవకాశం చిక్కింది. బాబావారి పాదాలను కడిగిన ఆ చరణామృతాన్ని పొందగల్గే అవకాశం వారికి చిక్కింది. అంతేకాదు, సహవాస్ ముగిశాక, తెలుగువారు విజయవాడ వరకూ వెళ్ళడానికి వీలుగా మెహెరాబాద్ నుండి విజయవాడ వరకూ ఒక ప్రత్యేక రైలుని ప్రప్రథమంగా అవతారుడు ఏర్పాటు చేశారు. ఆనాడు బాబా ప్రేమికులందరూ తమ తిరుగు ప్రయాణంలో అహ్మద్‌నగర్ దాకా వెళ్ళకుండా, మెహెరాబాద్ నుండే బయల్దేరారు. అన్నింటికంటే మిన్నగా, ఆనాడు బాబా తన స్త్రీ మండలితో కలిసి మెహెరాబాద్‌లో వున్న రైలు పట్టాల దాకా వచ్చి, తన ప్రేమికులందరికీ ఎంతో ప్రేమతో వీడ్కోలు చెప్పారు. ఆంధ్రులతో ఎన్నో యుగాలుగా తనకు అనుబంధం వుందని బాబా ఈ సహవాస్‌లో చెప్పారు. అందుకు ప్రతీకగా ఈ అరుదైన సన్నివేశం నిలుస్తుంది.

## మెహెర్‌బాబా పత్రికలో ధారావాహిక సీరియల్‌గా

ఇంతటి మహత్తరమైన సహవాస్ కార్యక్రమ విశేషాలని లార్డ్ మెహెర్ వాల్యూం-7 పేజి నంబరు 3771 నుంచి 3814 వరకూ ప్రచురించిన సమాచారం ఆధారంగా తెలుగు అనువాదంలో మెహెర్‌బాబా పత్రికలో ధారావాహిక సీరియల్‌గా 2019 జనవరి నుంచి 2021 అక్టోబరు వరకూ ప్రచురించాం. ఈ సహవాస్‌లో అవతారుడు ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు సహవాసీలతో ముచ్చటించారు. ఈ సహవాస్ ఈ తరంవారి కోసమే కాదు, భవిష్యత్తులో తనను ప్రేమించేవారందరి కోసమని బాబా పలుమార్లు ప్రకటించారు. అవతారుని దివ్య సంభాషణా చాతుర్యమే మెహెరాబాద్ సహవాస్ కార్యక్రమం. దివ్యావతారుని సన్నిధిలో జరిగిన ఒక చక్కని అరుదైన సహవాస్ కార్యక్రమం. ఈ కార్యక్రమంలో జరిగిన అన్ని విషయాలు బాబా ప్రేమికులకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ముందుగా పత్రికలో సీరియల్‌గా, తిరిగి ఆ అద్భుత సహవాస్ విశేషాలను "మెహెరాబాద్ సహవాస్,1958 శీర్షికతో గ్రంధస్తం చేసి పాఠకులకు అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. బాబా ప్రేమికులు ప్రతిఒక్కరూ తప్పక చదవాల్సిన పుస్తకం మెహెరాబాద్ సహవాస్ 1958. ప్రతి ఇంటా తప్పక వుండవల్సినదీ పుస్తకం. త్వరలోనే అవిష్కరించనున్న ఈ పుస్తక ప్రతులను కావల్సినవారు ముందుగా తెలియజేసిన ఉభయకుశలోపరి. 2022 మే సంచిక నుండి పత్రిక ప్రారంభించి 22వ సంవత్సరంలో అడుగిడుతున్న శుభసందర్భంలో మెహెర్‌బాబా పత్రిక పక్షాన ఈ గ్రంధం ప్రచురించనున్నాం.

## దేవుని సన్నిధిలో

1955 నవంబరు 4 నుండి డిశెంబరు 2 వరకూ, గుజరాతీ, హిందీ, తెలుగు, మరాఠీ ప్రాంతాలవారికి ఒక్కొక్కరికి ఐదు రోజుల చొప్పున మెహెరాబాద్‌లో ప్రత్యేకంగా బాబా సహవాస్ ఏర్పాటు చేశారు. ఈ సహవాస్‌లో బాబా చెప్పిన ఎన్నో మహత్తర ఆధ్యాత్మిక విషయాలను **'దేవుని సన్నిధిలో'** పేరిట ప్రచురించి 2018 మే 19న అందజేశాం.

## ఈ అవతారకాలం ప్రత్యేకం

**ఈ అవతారకాలంలో 1955, 1958 సంవత్సరాలకు చాలా ప్రత్యేక స్థానం వుంది. మెహెరాబాద్‌లో సహవాస్ సమయంలో భిన్న భాషా ప్రాంతీయులు మెహెరాబాద్ పూదోటలో దివ్యావతారుని సమక్షంలో చక్కగా విహరించారు. వీరందరూ పరబ్రహ్మ, పరమాత్మ, దేవ దేవుడి సన్నిధిలో ఓలలాడారు. ఈ సహవాస్‌లో పాల్గొన్న ఆనాటి సహవాసీలందరూ ధన్యులు. ఆనాటి విషయాలు పదిలంగా బద్రపరచుకునే ప్రయత్నం చేద్దాం! ఇదొక మహత్తర అవకాశంగా భావిద్దాం!! పాఠకులు స్పందించగలరు.**

## విశాఖపట్నం నూతన కార్యనిర్వాహక బృందం

**షిప్‌యార్డ్ కాలనీ, సింధియా**

2022 మే 8న జరిగిన సాధారణ సమావేశంలో ఈ క్రింది సభ్యుల్ని **(2022- 24)**ఎన్నుకొన్నట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.

1. శ్రీ చెట్టు శివ ప్రసాదరావు, అధ్యక్షులు,
2. శ్రీ ఎస్వీయస్ రామారావు, కార్యదర్శి,
3. శ్రీ ఎం. హరి మెహెర్, ఉపాధ్యక్షులు,
4. శ్రీమతి చెట్టు విజయలక్ష్మి, ఉపాధ్యక్షులు,
5. శ్రీ ఎ.ఎల్. కాంతారావు, సహాయ కార్యదర్శి,
6. శ్రీ పి. కామేశ్వరరావు, కోశాధికారి

### కార్యనిర్వాహక సభ్యులు

శ్రీ కె.వి.రత్నం, శ్రీ వల్లూరి నాగేశ్వరరావు,
శ్రీ ప్రకాశ్ మెహెర్, శ్రీ టి. అప్పలనారాయణ,
శ్రీ ఆర్.ఎమ్. రాజు, శ్రీ యస్. గోవిందరాజు, శ్రీమతి వర్షా ఉభాలే.

# సద్యః ఫలితం




**మెహెర్‌బాబా సన్నిధిలో జరిగిన అనేక వాస్తవ జీవిత కథా మంజరి “సద్యః ఫలితం”. డాక్టర్ మల్లాది శారద** రాసిన ఈ పుస్తకాన్ని మెహెరాబాద్‌లో అవతారుని సన్నిధిలో విజయదశమి పండుగరోజున, (2021 అక్టోబరు 15) లాంఛనంగా అవిష్కరించారు. సద్యః ఫలితం అంటే అవతారుడి దరిచేరిన వారికి తగిన ఫలితం తక్షణం లభిస్తుందన్న ఉద్దేశ్యంతో ఈ పుస్తకానికి ఆ పేరుపెట్టామని రచయిత్రి పేర్కొన్నారు. **అవతారుడి సర్వజ్ఞతను చాటిచెప్పే సుమారు 40 కథాంశాలతో** ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ప్రతిఒక్కరూ తప్పక చదవవల్సిన పుస్తకం. ప్రతిఇంటా **తప్పక వుండవల్సిందీ పుస్తకం. పుస్తకం ఖరీదు రూ. 100/-.మరిన్ని వివరాలకు. శ్రీమతి మల్లాది శారద (99595-53218, 8309-007935) సంప్రదించగలరు.**

# గాజువాక సెంటర్

ఏప్రిల్ 3, 10, 24, మే 01 తేదీలలో గాజువాక బాబా కేంద్రంలో ప్రత్యేక సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు.
ఏప్రిల్ 10న శ్రీరామనవమి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమాన్ని శ్రీ డి. మెహెర్‌బాబా గారింట్లో ఏర్పాటు చేశారు. శ్రీ మల్లిక్ బృందం, శ్రీ పి శశాంక్, బెంగళూరు, స్థానిక బాబా ప్రేమికులు భజన గీతాలు ఆలాపించారు. శ్రీ జెఎస్ఎన్ సుబ్రహ్మణ్యం, హైదరాబాద్, శ్రీమతి రజని కాకినాడ, శ్రీమతి ప్రభావతి భాస్కర్, మెహెరాబాద్, శ్రీమతి మెహెర్ పావని, విశాఖ బాబా సందేశాలపై ప్రసంగించారు.
ఏప్రిల్ 24న 99వ సప్తవర్ణ పతాకావిష్కరణోత్సవం ఘనంగా జరుపుకున్నారు. శ్రీమతి మెహెర్ రజని, శ్రీ వల్లూరి నాగేశ్వరావు పతాక విశిష్టతపై ప్రసంగించారు.

**భగవంతుడు అన్నింటిని క్షమిస్తాడు, కాని త్రికరణశుద్ధి లేని వానిని మాత్రం క్షమించడు**

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్వర్ధిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు
లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మావు,
పరమాత్మవు, అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# బందరు సహవాస్ - చిత్రమాలిక



## జీవిత సభ్యత్వం

**2022 మార్చిలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ కె.వి. సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం | రూ 1000/- |
| 2. | | |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152,**
**IFSC CODE: IOBA 0001732.**
**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-.**

**ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973,**
**IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.


**మా అడ్రస్:**
**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
**ఫోన్: 99595-53218. email: malladisukku@gmail.com**



Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**